PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 104 | విజయవాడ, బుధవారం 15 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 15 November 2023 | Rs



ఆయిల్‌పామ్ రైతు కుదేలు

- నేలనంటిన ధరలు

లోపలి పేజీలో..



ఫైనలే టార్గెట్..

నేడు న్యూజిలాండ్‌తో భారత్ సెమీస్ పోరు 8



గన్నవరం విమానాశ్రయంలో సీతారాం ఏచూరికి, బివి రాఘవులకు స్వాగతం పలుకుతున్న వై వెంకటేశ్వరరావు, జె జయరాం

సర్వం సిద్ధం

- నేడు ప్రజారక్షణ భేరి బహిరంగసభ
- విజయవాడకు చేరుకున్న సీతారాం ఏచూరి
- భారీగా తరలుతున్న ప్రజానీకం
- 10 గంటలకు ఫుడ్ జంక్షన్ నుండి మహాప్రదర్శన
- అగ్రభాగాన రెడ్ డ్రస్ వాలంటీర్ల కవాతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రత్యామ్నాయ ప్రజా ప్రణాళికను వివరించేందుకు సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బహిరంగసభకు సర్వం సిద్ధమైంది. విజయవాడ నగరంలో ఎక్కడ చూసిన ఎర్రజెండాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున తరలివస్తున్న ప్రజానీకానికి అవసరమైన ఏర్పాట్లు చేయడంలో పార్టీ శ్రేణులు నిమగ్నమైనాయి. బహిరంగ సభా ప్రాంగణమైన సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలోనూ ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభలో పాల్గొనే వారికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా, ఎండ పడకుండా ఉండేందుకు వీలుగా టెంట్లు ఏర్పాటు చేశారు. వేలమంది కూర్చున్నా అందిరకి కనపడే విధంగా డయాస్‌ను రూపొందించారు.బుధవారం ఉదయం ఉదయం పది గంటలకు బిఆర్‌టిఎస్ రోడ్డులోని ఫుడ్ జంక్షన్ నుండి మహాప్రదర్శన ప్రారంభం కానుంది. అక్కడ నుండి భగత్‌సింగ్‌రోడ్డు మీదుగా సత్యనారాయణపురం, ముత్యాలంపాడు, సింగ్‌నగర్ ఫ్లైఓవర్ మీదుగా డాబాకొట్ల సెంటర్ నుండి స్టేడియానికి ప్రదర్శన చేరుకుంటుంది. అనంతరం బహిరంగ సభ ప్రారంభమవుతుంది. బహిరంగ సభలో పాల్గొనడానికి సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మంగళవారం సాయంత్రమే విజయవాడకు చేరుకున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే బహిరంగ సభలో ఏచూరితో పాటు పొలిట్‌బ్యూరో సభ్యులు పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, ఎస్.పుణ్యవతి, సీనియర్ నాయకులు పి.మధుతోపాటు మిగతా 2లో

హైడల్ ప్రాజెక్టుల నిపుణుల కమిటీలో..

అదానీ సలహాదారు

- అదానీ గ్రూపు ప్రాజెక్టులకు లైన్ క్లియర్ చేసేందుకే !
- కేంద్ర ప్రభుత్వ తీరుపై సర్వత్రా ఆగ్రహం



జనార్ధన్ చౌదరియోన్

వడ్డించే వాడు మనవాడైతే.. ఏమూల కూర్చున్నా పంచభక్ష పరమాన్నాలకు కొదవ ఉండదని నానుడి. ఇప్పుడు మోడీ ప్రభుత్వం తీరు కూడా అలాగే ఉంది. పర్యావరణం ప్రగతికి ఎంతో కీలకమని చెప్పే బిజెపి సర్కార్.. ఇప్పుడు ఏకంగా అడవుల నుంచి గిరిజనుల్ని తరిమేసి అటవీసంపదను కొల్లగొట్టేందుకు చట్టాలను ఎడాపెడా మార్చేస్తోంది. క్రోనీ కేపిటలిస్టుల ప్రయోజనాలను అందునా ముఖ్యంగా అదానీకి లబ్ధి చేకూర్చేందుకు కీలకమైన కేంద్రప్రభుత్వ కమిటీలో అదానీ గ్రూపు సలహాదారుడికి చోటు కల్పించింది. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి..



ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని హైడల్ ప్రాజెక్ట్ ప్రతిపాదనలను పర్యవేక్షించే నిపుణుల అంచనాల కమిటీ (ఇఎసి)లో అదానీ సలహాదారు జనార్ధన్ చౌదరియోన్‌కు ప్రాతినిధ్యం కల్పించడం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వివిధ కంపెనీలు సమర్పించిన హైడల్ ప్రాజెక్ట్ ప్రతిపాదనలను మదింపు వేయడం, పర్యవేక్షించడం వంటివి ఈ కమిటీ చేస్తుంది. ప్రస్తుతం అదానీ కంపెనీకి చెందిన ఆరు హైడల్ ప్రాజెక్ట్ ప్రతిపాదనలు ఈ కమిటీ ముందు అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ స్థితిలో కమిటీలోని జనార్దన్ చౌదరియోన్ నియామకం అదానీకి లబ్ధి చేకూర్చేందుకేనని ప్రతిపక్ష నేతలు ఎక్స్ వేదికగా ట్వీట్లు చేశారు. జల విద్యుత్, నదీ లోయ ప్రాజెక్టుల కోసం మంత్రిత్వ శాఖ నిపుణుల అంచనాల కమిటీ (ఇఎసి)ని పునర్వ్యవస్థీకరించినప్పుడు ఆయనను సభ్యుడిగా చేర్చారు.

పునర్వ్యవస్థీకరించబడిన ఈ కమిటీ (ఇఎసి) ప్రారంభ సమావేశం అక్టోబర్ 17-18 తేదీలలో జరిగింది. మహారాష్ట్రలోని సతారాలో అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎజిఇఎల్) కు చెందిన 1500 మెగావాట్ల తరాలి పంపింగ్ స్టోరేజీ ప్రాజెక్ట్ ప్రతిపాదనలతో అక్టోబర్ 17 సమావేశానికి చౌదరి హాజరైనట్లు అధికారిక రికార్డులు సూచిస్తున్నాయి.

ఈ కమిటీ ఎజిఇఎల్ ప్రాజెక్ట్ లే అవుట్‌లో మార్పులకు అనుగుణంగా ప్రాజెక్ట్ నిబంధనల (టిఒఆర్)లో మార్పులను కోరింది. ప్రతిపాదిత నీటి వాహక వ్యవస్థ ఇప్పటికే ఉన్న విండ్ ఫామ్‌తో కలుస్తుందని తెలుసుకున్నప్పుడు ఈ సర్దుబాటు అవసరమైంది. ఈ వ్యవస్థ భూగర్భంలో నిర్మించబడిందా? లేదా విండ్ టర్బైన్ పునాదుల కింద నిర్మించబడిందా? అనే నిర్మాణ సవాళ్లను ఎదుర్కొంటోంది. చర్చల తర్వాత, అదానీకి చెందిన ఎజిఇఎల్ అభ్యర్థనను ఇఎసి ఆమోదించడం గమనార్హం. ఈ విషయంలో, చౌదరి మాట్లాడుతూ ఎజిఇఎల్ ప్రాజెక్ట్‌పై ఇఎసి చర్చలో తాను పాల్గొనలేదని అన్నారు. సమావేశం మినిట్స్‌లో ఆయన తిరస్కరణ ప్రస్తావనే లేదు.

పర్యావరణ (రక్షణ) చట్టం, 1986 ప్రకారం 2006 ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఇఐఎ) నోటిఫికేషన్ ద్వారా నిర్దేశించబడిన ప్రాజెక్ట్‌లకు అనుమతి మంజూరు చేసే బాధ్యత ఇఎసికి ఉంది. నిర్దిష్ట ప్రాజెక్ట్‌లకు ముందస్తు పర్యావరణ అనుమతి (ఇసి) అవసరం. వివిధ రంగాల్లోని ప్రతిపాదనల క్లియరెన్స్‌పై నిర్ణయం తీసుకునే బాధ్యతను ఈఏసీలు కలిగి ఉంటాయి. అలాంటి కీలకమైన ఇఎసి సభ్యునిగా చౌదరి నియామకం ఆందోళనలు రేకెత్తిస్తోంది. ప్రత్యేకించి అదానీకి చెందిన పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌లన్నీ అదే కమిటీ పరిశీలనలో ఉన్న సమయంలో ఈ నియామకం జరగటమే ఈ ఆందోళనలకు కారణం.

కమిటీ ముందు అనుమతి కోసం అదానీ ప్రాజెక్టులు

ఇఎసి ముందు అనుమతుల కోసం అదానీకి సంబంధించిన ఆంధ్రప్రదేశ్ లోని రైవాడలో 850 మెగావాట్లు, పెదకోటలో 1800 మెగావాట్లు, మహారాష్ట్రలోని పట్‌గావ్ లో 2100 మెగావాట్లు, కోయినా-నివాకనేలో 2,450 మెగావాట్లు, మల్షేజ్ ఘాట్ లో 1500 మెగావాట్లు, తాలూలో 1500 మెగావాట్లు ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లో రూ.15,740 కోట్ల పెట్టుబడితో అదనంగా 3.7 గిగావాట్ల పంప్‌డ్ స్టోరేజీని అభివృద్ధి చేయాలని భావిస్తోంది.

ప్రతిపక్షాల ఆగ్రహం

అదానీకి చెందిన 10,300 మెగావాట్లతో కూడిన ఆరు ప్రాజెక్టులు అనుమతుల కోసం కమిటీ ముందున్నాయని, ఆ కమిటీ సభ్యుడిగా అదాని కంపెనీ సలహాదారుడిని నియమించడం దారుణమని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది "జాతీయ భద్రత పేరుతో ఎన్నికైన ఎంపీపై ఎథిక్స్ కమిటీ చర్యలకు ప్రతిపాదించింది. మరి పర్యావరణ మంత్రిత్వ శాఖలో ప్రయివేట్ కంపెనీ వ్యక్తిని ఏ నిబంధనలు ప్రకారం నియమించారు?" అంటూ ప్రశ్నించింది. టిఎంసి ఎంపీ మహువా మోయిత్రా "మోడీజీ పర్యావరణ మంత్రిత్వ శాఖ అదానీ ఉద్యోగి జనార్ధన్ చౌదరిని ఇఎసిలో సభ్యునిగా నియమించింది. అదానీకి చెందిన ఆరు ప్రాజెక్టుల ఆమోదానికేనా ..?" అంటూ విమర్శించారు.

బిటెక్ రవి అరెస్టు

ప్రజాశక్తి-కడప ప్రతినిధి



మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవిని మంగళవారం రాత్రి వల్లూరు మండలం పోలీసులు అరెస్టు చేశారు. వల్లూరు నుంచి వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను రిమ్స్‌కు పోలీసులు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కడప పర్యటన సందర్భంగా కడప విమానాశ్రయం వద్ద ఆందోళన చేశారని, పది నెలల కిందట పోలీసులపై దురుసుగా ప్రవర్తించారనే కారణంతో ఆయనను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. బిటెక్ రవి అరెస్టుకు నిరసనగా టిడిపి శ్రేణులు పులివెందులలో నిరసన చేశారు. గన్‌మెన్లు, డ్రైవర్‌ను వదిలేసి బిటెక్ రవిని పోలీసులు తీసుకెళ్లారని, ఆయనకు ఏం జరిగినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, పోలీసులదే బాధ్యతని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు.

పినరయి విజయన్‌కు క్లీన్ చిట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ముఖ్యమంత్రి విపత్తు సహాయ నిధి (సిఎండిఆర్ఎఫ్)కి సంబంధించి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేసేందుకు చేసిన ఆరోపణలు పూర్తిగా నిర్హేతుకమైనవని తేలిపోయింది. సిఎండిఆర్ఎఫ్‌పై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో తప్పుపట్టాల్సిందేమీ లేదని లోకాయుక్త స్పష్టంగా తేల్చి చెప్పింది. విజయన్‌తోపాటు 18 మంది మాజీ మంత్రులపై దాఖలైన పిటిషన్‌ను లోకాయుక్త కొట్టివేసింది. బంధుప్రీతి లేదా అవినీతి జరిగిందనడానికి ఎటువంటి ఆధారాలు లేవని జస్టిస్ సిరియాక్ జోసెఫ్, జస్టిస్ హరూన్ అల్ రషీద్, జస్టిస్ బాబు మాథ్యూ పి జోసెఫ్‌తో కూడిన లోకాయుక్త ధర్మాసనం స్పష్టం చేసింది.

సిఎండిఆర్ఎఫ్‌లో నిధులను దుర్వినియోగం చేశారంటూ 2018లో కాంగ్రెస్ నేత ఆర్ఎస్ శశికుమార్ ఈ పిటిషన్ వేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌సిపి మాజీ చీఫ్ ఉజ్వార్ విజయన్ కుటుంబానికి రూ.25 లక్షలు, మరణించిన ఎమ్మెల్యే రామచంద్రన్ నాయర్ కుటుంబానికి రూ.9 లక్షలు, ప్రమాదంలో మరణించిన పోలీసు అధికారి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం చేశారని ఆరోపించారు. జస్టిస్ సిరియాక్ జోసెఫ్, జస్టిస్ హరున్ ఉల్ రషీద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ వ్యాజ్యాన్ని విచారించింది. దీనిపై ఏకగ్రీవ నిర్ణయానికి రాలేకపోయింది. దీంతో 2023 మార్చిలో ఈ కేసును విస్తృత ధర్మాసనానికి నివేదించింది. పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం ప్రభుత్వ నిర్ణయాలను సమర్థిస్తూ ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్

- టిటిడిలో 114 జిఒ అమలుకు గ్రీన్ సిగ్నల్
- స్విమ్స్‌లో రూ.197 కోట్లతో భవనాలు నిర్మాణం
- టిటిడి పాలకమండలి నిర్ణయం

3



కులగణన సదస్సులకు అన్ని పార్టీలనూ ఆహ్వానించాలి

సిఎస్‌కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణన కార్యక్రమ సన్నాహాల్లో భాగంగా ఈ నెల 17 నుంచి 22 వరకు జిల్లా స్థాయిలో వర్క్‌షాపులు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లుగా అధికారులు ప్రకటించారని, వాటికి అన్ని రాజకీయ పార్టీలనూ ఆహ్వానించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. ఈ సభలకు ఎవరిని ఆహ్వానిస్తున్నారో స్పష్టంగా ప్రకటించలేదని, రాజమండ్రి మీడియాలో వచ్చిన సమాచారం ప్రకారం ఎవరైనా హాజరు కాదలచుకున్నవారు అప్లై చేసుకోవాలని కోరినట్లు తెలిసిందని పేర్కొన్నారు. ముఖ్యమైన అంశంపై ఇలా క్యాజువల్‌గా ప్రకటించడం కులగణన కార్యక్రమానికి న్యాయం జరగదని పేర్కొన్నారు. భవిష్యత్ విధానాలను ప్రభావితం చేసే ఇంత ముఖ్యమైన అంశంపై కచ్చితమైన సమాచారం, నిష్పక్షపాతంగా జరగాలంటే రాజకీయ పార్టీలను భాగస్వాములను చేయడం సరైన పద్ధతని తెలిపారు. దీనిపై చొరవ తీసుకుని ఈ సమావేశాలకు అన్ని రాజకీయ పార్టీలనూ ఆహ్వానించి, వారి సూచనలను కూడా తీసుకుని ఈ కార్యక్రమం సమర్థవంతంగా, సమగ్రంగా జరిగేలా చూడాలని కోరారు.

విరాళాలపై టిడిపికి మరోమారు సిఐడి నోటీసులు


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీకి సంబందించిన బ్యాంకు ఖాతాల వివరాలను అందించాలని ఎపి సిఐడి ఆ పార్టీకి మరోమారు నోటీసు అందజేసింది. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సిఐడి అధికారులు మంగళవారం వెళ్లి నోటీసులను కార్యాలయ కార్యదర్శి అశోక్‌బాబుకు అందజేశారు. టిడిపి బ్యాంకు ఖాతాల వివరాలను ఈ నెల 18లోగా ఇవ్వాలని ఆ నోటీసులో సిఐడి పేర్కొంది. స్కిల్ డెవలప్‌మెంటు కేసు నేపథ్యంలో పార్టీ ఖాతాలోకి వచ్చిన విరాళాలకు సంబంధించిన వివరాలు కావాలంటూ సిఐడి కోరింది. బ్యాంకు ఖాతాల వివరాలను తెలపాలంటూ గతంలో సిఐడి ఇచ్చిన నోటీసుకు స్పందించకుండా రాజకీయ పార్టీలకు సంబంధించి విరాళాలను అడగడాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్ర హైకోర్టును టిడిపి ఆశ్రయించింది. ఈ కేసు ప్రస్తుతం హైకోర్టులో విచారణలో వుంది. సిఐడి రెండోసారి ఇచ్చిన నోటీసుపై కూడా టిడిపి స్పందిస్తుందా లేదా అనేది చూడాలి.

భాషా వలంటీర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

- షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి
- ఆదివాసి గిరిజన సంఘం ధర్నాలో వి శ్రీనివాసరావు

2



విరాళం అందజేస్తున్న శివరాం

ప్రజాశక్తికి విరాళం

ప్రజాశక్తి - విశాఖపట్నం

ప్రజాశక్తి సాహితీ సంస్థకు విశాఖపట్నం రాజీవ్ నగర్‌లో నివాసం ఉంటున్న షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగి జె.శివరాం రూ.50 వేలు విరాళం అందించారు. ఆ మొత్తాన్ని ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎ.వెంకటేశ్వరరావు, విశాఖ డెస్క్ ఇన్‌ఛార్జ్ కె.అప్పలనాయుడు స్వీకరించారు. శివరాం ప్రజాశక్తి అభిమాని. షిప్‌యార్డులో పనిచేస్తున్న కాలంలో ఆయన పోరాటాల్లో పాల్గొన్నారు. విరాళం అందించిన ఆయనకు ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిఐటియు అచ్యుతరావు, ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికగా ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పిన క్షుణ్ణంగా నోట్ చేసి సరిదిద్దుకుంటాం. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

విజయ్‌కుమార్‌పై దాడి అమానుషం

- దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నంద్యాల జిల్లా కొలిమిగుండ్లకు చెందిన న్యాయవాది మంద విజయ్‌కుమార్‌పై దాడి అమానుషమని కెవిపిఎస్ ఆవేదన వ్యక్తం చేసింది. విజయ్‌కుమార్‌ను చెప్పులతో కొడుతూ, వీధిలో నడిపించిన వైసిపి కార్యకర్తలు నాగేశ్వరరావు, సురేష్, శ్రీరాములు, రమాదేవి, శ్రీనివాసులు, కళావతిపై కేసులు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని అప్పారావుపాలెం ఎస్‌సి కాలనీలో తల్లీకుమార్తె ఇంట్లో నిద్రిస్తుండగా పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన దుండగులపై కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను రాష్ట్ర ఎస్‌సి కమిషన్ పరామర్శించి వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల జిఓలో నిబంధనలు మార్చాలి

- ముఖ్యమంత్రికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల జిఓలో నిబంధనలు మార్చాలని, అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు అందజేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సంకల్పించడం హర్షణీయమన్నారు. జిఓ నెంబరు 395లోని నిబంధనలు జర్నలిస్టులను నిరాశకు గురిచేశాయన్నారు. రాష్ట్ర విభజనానంతరం తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నందున 2014 తర్వాత లబ్ధిపొందని, అరులైన ప్రతి జర్నలిస్టుకూ ఇళ్ల స్థలం మంజూరు చేయాలని కోరారు. ఈ ఏడాది అక్రిడిటేషన్ మంజూరు కాని వారందరికీ అన్యాయం జరగకుండా, సీనియారిటీ ప్రాతిపదికగా ఇళ్ల స్థలం కేటాయించాలన్నారు. అలాగే ఇళ్ల స్థలాలు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

భాషా వలంటీర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి





ధర్నాలో పాల్గొన్న ఏజెన్సీ భాషా వలంటీర్లు.. ఇన్‌సెట్‌లో ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు వేదికపై లక్ష్మణరావు తదితరులు

- షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి
- ఆదివాసీ గిరిజన సంఘం ధర్నాలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

షెడ్యూల్ ఏరియాలోని ఆదివాసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతంలోని భాషా వలంటీర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెడ్యూల్ ఏరియాలో గిరిజనులకు వందశాతం రిజర్వేషన్ కల్పించే జిఓ నెం.3ను తక్షణం పునరుద్ధరించాలని కోరారు. అవసరమైతే ఈ మేరకు చట్టసవరణ చేయాలని సూచించారు. అలాగే, గిరిజనులకు వారి మాతృభాషలో బోధించేందుకు నియమించిన భాషా వలంటీర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. జటివల సీతంపేట నుండి విజయవాడకు నిర్వహించిన బస్సు యాత్ర సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని సమస్యలను స్వయంగా పరిశీలన చేసినట్లు చెప్పారు. అనేక ప్రాంతాల్లో భాషా వలంటీర్లు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం పేరుతో మాతృభాషలో బోధనను నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. మాతృభాషలో విద్యాబోధన సరైందని ప్రపంచ అనుభవాలు చెబుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియంను బలవంతంగా రుద్దుతోందన్నారు. త్రిపుర రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఆదివాసులు మాట్లాడే భాషలో విద్యాబోధన కోసం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతంలోని భాషా వలంటీర్లకు ప్రభుత్వం కేవలం రూ.5 వేలు వేతనంగా ఇవ్వడం సరైందికాదన్నారు. కేంద్రం నుండి సర్వశిక్షా వచ్చే నిధులతోపాటు ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. భాషా వలంటీర్లు తమ సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లోని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలన్నింటిలో వైసిపిని ప్రజలు గెలిపించారని, అయితే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం లేదన్నారు. భాషా వలంటీర్లకు కనీస వేతనాలు ఇవ్వకుండా కేవలం పుస్తకాలు ముద్రణ కోసమే ఖర్చు చేయడం తగదన్నారు. పుస్తకాలు ఇచ్చి చదువు చెప్పే టీచర్ లేకుండా ఎలా లక్ష్యం నెరవేరుతుందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ఉపాధి అవకాశాల్లో 100 శాతం గిరిజనులకే ఇచ్చేందుకు వున్న జిఓ నెంబర్ 3ను పునరుద్ధరించేలా చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజన్నదొర డిప్యూటీ సిఎంగా వున్నా ఏమాత్రం సమస్యల గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లోని హాస్టళ్లు, స్కూళ్లలో ఇస్తున్న మెనూ ఏమాత్రం సరిపోవడం లేదని, పెంచాలని డిమాండ్ చేశారు. భాషా వలంటీర్లను రెన్యువల్ చేసే అంశంలో పైరవీలకు అవకాశం లేకుండా రెన్యువల్స్ చేయాలన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పల నర్సయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి బాలదేవ్ మాట్లాడుతూ.. జిఓ నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంత రిక్రూట్‌మెంట్ కోసం ప్రత్యేక డిఎస్‌సి వేయాలని, భాషా వలంటీర్లకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, సుబ్బరావమ్మ తదితరులు మాట్లాడారు.

కౌలుదార్లకు అందని రుణసాయం

- గతేడాదితో పోలిస్తే సగమే మంజూరు
- సాయం పెంచాలని బ్యాంకర్లను కోరిన ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కౌలు రైతులకు మరింత సాయం అందించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. తాజాగా జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బిసి) సమావేశంలో దీనిపై చర్చించారు. గతేడాదితో పోల్చిచూస్తే ఈ ఏడాది కౌలుదార్లకు అందిన సాయం తక్కువగా ఉన్నట్లు బ్యాంకర్ల గణాంకాలే స్పష్టం చేయడంతో ఇక నుంచి అయినా సాయాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఎస్ఎల్‌బిసి అధికారులు అందించిన వివరాల మేరకు 2021-22 ఆర్థిక సంవత్సరంలో క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డ్స్ (సిసిఆర్‌సి) కింద 1.46 లక్షల మందికి రూ.1,402 కోట్ల రుణాలు అందించారు. అయితే 2022-23 ఆర్థిక సంవత్సరంలో మాత్రం 69,832 మంది కౌలు రైతులకు మాత్రమే రుణాలందాయి. అంటే గతంలో రుణాలు మంజూరైనవారి సంఖ్యతో పోలిస్తే ఈ దఫా అందులో సగం మందికి రుణాలు మంజూరు కాలేదు. అలాగే ఈ ఏడాది మంజూరైన రుణాల మొత్తం కూడా రూ.905 కోట్లే. ఇది కూడా గతేడాది కన్నా రూ.600 కోట్లు తక్కువగా ఉండడం గమనార్హం.

2020-21లో నిర్దేశించుకున్న లక్ష్యంలో కేవలం 16.24 శాతం సాధించగా, 2021-22లో 42 శాతం సాధించారు. ఇక 2022-23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్య సాధన తగ్గిపోయి కేవలం 39.15 శాతం మాత్రమే సాధించారు. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకు 31 వేల మంది కౌలు రైతులకు రూ.389 కోట్లు మాత్రమే రుణాలు మంజూరయ్యాయి. ఇది లక్ష్యంలో 20 శాతంగా మాత్రమే ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే కౌలు రైతులకు అందించాల్సిన సాయాన్ని మరింతగా పెంచాలని ప్రభుత్వం తరపున ఆర్థిక, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులు బ్యాంకర్లను కోరారు.

గిరిజనులపై పెరిగిన దాడులు

- గవర్నరుకు ధారునాయక్ ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో గిరిజనులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని రాష్ట్ర ఎస్‌టి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఎమ్ ధారునాయక్ విమర్శించారు. గిరిజనులపై దాడులు జరుగుతున్నా.. వైసిపి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. ఈ మేరకు రాజ్‌భవన్‌లో గవర్నరు అబ్దుల్ నజీర్‌ను మంగళవారం ధారునాయక్ బృందం కలిసి ఫిర్యాదు చేశారు. గిరిజనుల హక్కులు కాలరాయబడుతున్నాయని, ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గిరిజనులకు మాత్రమే కల్పించే జిఓ నెంబరు 3ను సుప్రీంకోర్టు రద్దు చేస్తే పక్క రాష్ట్ర ప్రభుత్వాలు అప్పీల్ చేశాయని, ఇక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. గతంలో ఉన్న 16 గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేశారని తెలిపారు. గవర్నరును కలిసిన వారిలో రాష్ట్ర ఎస్‌టి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మొగిలి కల్లయ్య ఉన్నారు.

భీమవరంలో అగ్నిప్రమాదం

- నిరాశ్రయులైన ఏడు కుటుంబాలు

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఏడు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెంటేవారితోటలో ఎనిమిది గదులతో నిర్మించుకున్న రెండు తాటాకు ఇళ్లలో కంచర్ల భవాని, డి.దుర్గారావు, బూడిద ఆదిలక్ష్మి, మోటుపల్లి బేబీ సరోజినీ, డి.మణి, బోయినపల్లి రమణయ్య, గుండెపల్లి చంద్రకు చెందిన ఏడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరంతా చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకు ఇళ్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో అందులో నివసిస్తున్న వారంతా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయటకు పరుగులు తీశారు. ఇళ్లలోని సామానులు అగ్నికి ఆహుతి కావడంతో వారంతా కట్టుబట్టలతో మిగిలారు. భీమవరం, ఆకివీడుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇళ్లన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.తొమ్మిది లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు.

కాలి బూడిదైన రూ.3.20 లక్షల నగదు

అగ్ని ప్రమాదంలో రూ.3.20 లక్షల నగదు దగ్ధమైందని డ్వాక్రా మహిళలు బూడిగ ఆదిలక్ష్మి, గుండెపల్లి చంద్ర కన్నీరుమున్నీరయ్యారు. బ్యాంకులో చెరో రూ.లక్షా 60 వేలు చొప్పున రుణం తీసుకున్నామని, ఆ సొమ్మును ఇంట్లో బీరువాలో భద్రపరిచామని తెలిపారు. అగ్నిప్రమాదంలో ఆ సొమ్మంతా కాలిబూడిదైందని ఆవేదన వ్యక్తం చేశారు.



బైకు ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న వెంకటమ్మ

ప్రజారక్షణ భేరికి తరలిన 'ఉక్కు' కార్మికులు

- విశాఖ నుంచి విజయవాడకు బైకు ర్యాలీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ నినాదంతో ఉక్కు కార్మికులు విజయవాడకు కదిలారు. సిపిఎం ఆధ్వర్యాన బుధవారం జరిగే ప్రజారక్షణ భేరి సభలో పాల్గొనేందుకు విశాఖలోని కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం నుంచి వీరు బైకు ర్యాలీగా బయలుదేరారు. సిపిఎం, సిఐటియు కమిటీల ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేపట్టిన బైకు ర్యాలీని ఉక్కు నిర్వాసిత మహిళ బొడ్డ వెంకటమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను కేంద్ర ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కారు కుట్రలకు స్టీల్‌ప్లాంట్ బలైపోతుంటే రాష్ట్రంలోని జగన్ సర్కారు చేష్టలుడిగి చూస్తుండటం దారుణమన్నారు. ప్లాంట్ పరిరక్షణకు కేంద్రంపై ఒత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. పోరాటాలతోనే కర్మాగారాన్ని కాపాడుకోగలమని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. తమిళనాడు, కేరళలోని ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకునేందుకు ఆయా ముఖ్యమంత్రులు చేస్తోన్న కృషిని వివరించారు. అనకాపల్లి మీదుగా విజయవాడ వైపు బైక్ ర్యాలీ సాగింది.



కార్మిక రంగంలో వాసుదేవ్ ఆచార్య విశేష సేవలు

- సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, ట్రేడ్ యూనియన్ నాయకులుగా వాసుదేవ్ ఆచార్య దేశానికి విశేష సేవలందించారని, రైల్వే కార్మికులను ఆర్గనైజ్ చేయడంలో కృషి మరువలేనిదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం సీనియర్ నేత వాసుదేవ్ ఆచార్య సంతాప సభ మంగళవారం గవర్నరుపేటలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైల్వే ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణను వాసుదేవ్ ఆచార్య గట్టిగా వ్యతిరేకించారని, కోల్ వర్కర్లను ఆర్గనైజ్ చేశారని, బెంగాల్‌లో ఉగ్రవాదులను ఎదుర్కోవడంలో ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు. పార్టీ మీద భౌతికంగా, సిద్ధాంతపరంగా జరుగుతున్న దాడులను తిప్పికొట్టడంలో ముందు వరుసలో ఉన్నారని తెలిపారు. పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వాసుదేవ్ ఆచార్య తొమ్మిదిసార్లు పార్లమెంటు సభ్యునిగా ఉన్నా సాధారణ కార్యకర్తగా, నిరాడంబరంగా జీవించారని, లక్ష్యసాధన కోసం చివరికంటా నిలబడ్డారని పేర్కొన్నారు. పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరావు మాట్లాడుతూ వాసుదేవ్ ఆచార్య కార్మికోద్యమానికి అందించిన సేవలను కొనియాడారు. రాష్ట్ర కమిటీ సభ్యులు జె జయరాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అండ్ర మాల్యాద్రి పాల్గొన్నారు. సంతాప సూచకంగా మౌనం పాటించారు.

రైల్వే స్టేషన్లో..

విజయవాడ రైల్వే స్టేషన్లో ఎపి రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన వాసుదేవ్ ఆచార్య సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వివిఎల్ నరసింహులు మాట్లాడారు. నాయకులు ఇవి నారాయణ, వై ఆదిలక్ష్మి, ఎ లావణ్య పాల్గొన్నారు.

కేంద్ర నిధుల దుర్వినియోగం

- యనమల రామకృష్ణుడు విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి, అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను అవినీతి, దుబారా కార్యక్రమాలకు జగన్ ప్రభుత్వం మళ్లించిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆరోపించారు. రాష్ట్రం కోల్పోయిన నిధులకు జగన్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 94కు పైగా కేంద్ర పథకాలకు జగన్ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయకపోవడంతో నాలుగున్నరేళ్లలో రూ.వేలకోట్ల నిధులు రాష్ట్రం కోల్పోవాల్సి వచ్చిందన్నారు. రూ.71,449 కోట్ల నిధులు కేంద్రం నుంచి వచ్చిన నిమిషాల వ్యవధిలోనే దారి మళ్లించి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేంద్ర పథకాల ముందు వైఎస్ఆర్ పేర్లు చేర్చడంతో రూ.6 వేలకోట్ల నిధులను నిలిపేసిందని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3,084 కోట్ల నిధులను దారి మళ్లించారని విమర్శించారు. 14, 15వ ఆర్థిక సంఘం పంచాయతీల అభివృద్ధికి కేటాయించిన నిధులు రైతులకు ఇవ్వని విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.7,879 కోట్లను దారి మళ్లించి, లక్షలాది మంది ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేలా చేశారని పేర్కొన్నారు.

గాజాలో మారణకాండను తక్షణమే ఆపాలి

- 22న విజయవాడలో భారీ ర్యాలీ
- వామపక్ష పార్టీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతర్జాతీయ వేదికలు, ఐక్యరాజ్యసమితి చేసిన సూచనలను తుంగలో తొక్కి ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో పాలస్తీనాపై అత్యంత క్రూరంగా దాడులు చేస్తోందని, తక్షణం పాలస్తీనాలోని గాజాలో మానవ మారణ కాండను ఆపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. పాలస్తీనాకు సంఘీభావంగా ఈ నెల 22న విజయవాడలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశాయి. గాజాపై దాడులు ఆపాలని, పాలస్తీనా ప్రజల మాతృభూమి సాధనకై సాగించే స్వాతంత్ర్య పోరాటం జయప్రదం కావాలని కోరుతూ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, మైనార్టీ సంఘాలు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులతో విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడారు. భారతదేశం మొదటి నుండి యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఆలీనోద్యమానికి నాయకత్వం వహించిందన్నారు. మన దేశ విదేశాంగ విధానం కూడా పాలస్తీనాకే కట్టుబడే వారమన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేస్తుంటే ఇజ్రాయిల్ దేశాన్ని సమర్థించడం తగదని అన్నారు. అనాధిగా వస్తున్న విదేశాంగ విధానానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. గాజాలో ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న అమానుషమైన మారణ కాండలో ఇప్పటికే 10,000 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. అందులో పసిపిల్లలు, మహిళలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రజలు, పాఠశాలల్లోని విద్యార్థులు, వికలాంగులు ఉండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. పాలస్తీనాలో జాతి హననాన్ని తక్షణమే నిలిపివేయాలని ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు, శాంతివాదులు, మానవతావాదులు కోరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కూడా ఇప్పటికే రాజకీయ పార్టీలు, పలు సంస్థలు తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఈ నిరసన వాణిని మరింత బలపేతం చేసే లక్ష్యంతో విజయవాడలో ఈ నెల 22న భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, యువజనులు, ప్రజా సంఘాలు, మేధావులు, రచయితలు, స్వచ్ఛంధ సంస్థలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రొగ్రెసివ్ ఫోరం రాష్ట్ర నాయకులు బి జమీందార్, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ప్రసాదు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, ఎఐపిఎస్ఒ రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, పిఒడబ్ల్యు రాష్ట్ర నాయకులు పద్మ, షఫీ, ఎంటిఎఫ్ రాష్ట్ర నాయకులు డాని, ఎపి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, జెఐహెచ్ రాష్ట్ర నాయకులు మసీద్ బేగ్, కనిత సల్మా, పిన్నమనేని మురళి, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అప్సర్, సిపిఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు రవిచంద్ర, తదితరులు మాట్లాడారు.



రెడ్ డ్రస్ వాలంటీర్ల కావాతు రిహార్సల్స్

సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కార్యదర్శివర్గంలో వివిధ రంగాల బాధ్యతలు చూస్తున్న నాయకులూ ప్రసంగించనున్నారు.

ప్రత్యేక ఆకర్షణ కానున్న కవాతు


మహా ప్రదర్శనలో రెడ్ డ్రస్ వాలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణ కానుంది. వేలాది మంది రెడ్ డ్రస్ వాలంటీర్లు ప్రదర్శన ముందుభాగాన కదం తొక్కనున్నారు. వీరిలో కూడా ముందుభాగాన వందలాది మంది మహిళా రెడ్ డ్రస్ వాలంటీర్లు ఉంటారు. బహిరంగ సభా వేదిక వరకు వీరి కవాతు సాగుతుంది. రెడ్ డ్రస్ వాలంటీర్ల తరువాత ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో కళాకారులు ప్రదర్శనలో పాల్గొంటారు. నృత్యాలు, కోలాటాలు, విచిత్రవేషాలు, తప్పెటగుళ్ళు, కీలుగుర్రాళ్లతో కళాకారులు కదం తొక్కనునున్నారు. వారితరువాత ప్రజానీకం ప్రదర్శనలో పాల్గొననుంది. ఈ ప్రదర్శన, బహిరంగసభల్లో భాగస్వామ్యం కావడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ప్రజానీకం రాక ప్రారంభమైంది. మంగళవారం సాయంత్రానికే పెద్దసంఖ్యలో ప్రజలు ఎర్రజెండాలు చేతపట్టి విజయవాడకు చేరుకున్నారు. వివిధ జిల్లాలకు చెందిన రెడ్‌డ్రస్ వాలంటీర్లు విజయవాడకు రావడంతో పాటు, రిహార్సిల్స్ కూడా నిర్వహించారు.

ఆయిల్‌పామ్ రైతు కుదేలు

- నేలనంటిన ధరలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆయిల్ పామ్ ధర నేలను తాకింది. తాజాగా టన్ను ధర రూ.11,977కు దిగజారింది. గతంలో లాభాలు పంట పండించిన ఆయిల్‌పామ్ ఏడాదిగా నష్టాల బాట పట్టింది. కేంద్ర ప్రభుత్వం పామోయిల్‌పై దిగుమతి సుంకం రద్దు చేసింది. దీంతో, వంట నూనెలను ఉత్పత్తి చేసే సంస్థలు ఇతర దేశాల నుంచి ఆయిల్‌పామ్‌ను దిగుమతి చేసుకుంటున్నాయి. ఫలితంగా ధరలు నానాటికీ పతనమవుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరులో టన్ను రూ.12,951 ఉన్న ధర అక్టోబరు నాటికి రూ.12,122కు తగ్గింది. తాజాగా ఇది రూ.11,977కు దిగజారింది. ఇదే ధర కొనసాగితే ఎకరాకు రూ.65 వేల నుంచి రూ.80 వేల వరకు నష్టపోతామని సాగుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో 40,826 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. అత్యధికంగా నల్లజర్లలో 10,490 ఎకరాల్లో సాగు జరుగుతుండగా, కడియం మండలంలో అత్యల్పంగా 3 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతోంది. మొదటి కోత వచ్చే సరికి మూడు నుంచి ఐదేళ్ల సమయం పడుతుంది. అంతవరకూ దీనికి రైతులు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. టన్నుకు కనీసం రూ.20 వేలు ధర ఉంటేనే గిట్టుబాటు అవుతుందని వారు చెప్తున్నారు. జిల్లాలో పండిన ఆయిల్‌పామ్ గెలలను గానుగ ఆడించి, ముడి చమురును పెద్దాపురం, నల్లజర్లలోని ఎర్నగూడెంలో మిల్లులకు తరలిస్తుంటారు. ఆయా మిల్లుల్లో ప్రతి నెలా సగటు ముడి చమురు నిష్పత్తి (ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో-ఒఇఆర్) ఆధారంగా అధికారులు, వ్యాపారుల కమిటీ ధర నిర్ణయిస్తుంది. ధరల పతనానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని రైతులు, రైతు సంఘాలు చెబుతున్నారు. 2022 మేలో టన్నుకు రూ.23,665 ధర పలికింది. 2023 జనవరిలో రూ.17 వేలకు తగ్గిపోయింది. ప్రస్తుతం మరింత పతనమై రూ.11,977కు దిగజారడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగుకు గతంలో ప్రోత్సాహకాలు అందించేవి. దీంతో, 2020 నుంచి సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఆయిల్‌పామ్ సాగుకు నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ పథకం ద్వారా రైతులకు నేరుగా వారి ఖాతాల్లో రాయితీ సొమ్ము జమయ్యేది. ఈ పథకం ద్వారా ఇచ్చే సొమ్ములో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరించేవి. గతేడాది మొక్కలు నాటిన రైతులకు రాయితీ డబ్బులు అందలేదు. దీంతో, వారిలో నిరాశ మొదలైంది. కొత్తగా సాగు ప్రారంభించిన వారిని పెట్టుబడి భారం వెంటాడుతోంది.



ప్రభుత్వం ఆదుకోవాలి

ఆయిల్ పామ్ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. గతంలో ప్రభుత్వ ప్రోత్సాహకం అందజేయడం, ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఆయిల్‌పామ్ సాగు ప్రారంభించాం. ప్రస్తుతం టన్ను రూ.11,977 చొప్పున కొనుగోలు జరుగుతోంది. ఓ వైపు దిగుబడులు తగ్గిపోవడం, మరోవైపు ధర గిట్టుబాటు కాకపోవడంతో ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకూ నష్టం వాటిల్లుతోంది.

-పాతూరి సత్యనారాయణ, పామాయిల్ రైతు, అచ్చెన్నపాలెం, నల్లజర్ల మండలం

నిజాంపట్నం హార్బర్‌లో బోటు దగ్ధం

- ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-నిజాంపట్నం (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా నిజాంపట్నం హార్బర్‌లో ఓ మర బోటు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక మత్స్యకారుల కథనం ప్రకారం.. దీపావళి పండుగ సందర్భంగా అన్ని బోట్లను హార్బర్ జెట్టీలో నిలిపేశారు. మంగళవారం తిరిగి వేటకు వెళ్లేందుకు అవసరమైన నిత్యావసరాలు, ఇంధనాన్ని నింపుకొనే పనిలో మత్స్యకారులు నిమగ్నమయ్యారు. దండుప్రోలు చెన్నయ్యకు చెందిన మరబోటులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ట్యాంకులోని డీజిల్‌కు మంటలు వ్యాపించడంతో బోటు పూర్తిగా దగ్ధమైంది. బోటులో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, కృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తొలుత నిజాంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి, తరువాత తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బోటు విలువ సుమారు రూ.60 లక్షలకు పైబడి ఉంటుందని యజమాని తెలిపారు. ఇంజన్ వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు మత్స్యకారులు భావిస్తున్నారు.

జెవికెలో రూ.120 కోట్ల అవినీతి

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగనన్న విద్యా కానుక (జెవికె)లో రూ.120 కోట్ల అవినీతి జరిగిందని, ఢిల్లీ, యుపిలో ఇడి తీగ లాగితే రాష్ట్రంలో డొంక కదులుతోందని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 35 లక్షల మంది విద్యార్థులుండగా, బూట్లు, బ్యాగులు మాత్రం 42 లక్షల మందికి కొనుగోలు చేశారన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పిల్లలకు నాణ్యత లేని బూట్లు, బ్యాగులిచ్చి జగన్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇడి సమగ్ర విచారణలో మరింత అవినీతి బయటకు వచ్చే అవకాశముందని, ఉత్తరాంధ్ర నుంచి తాడేపల్లి వరకు అందరి కథ ఇడి వద్ద ఉందని అన్నారు. నాడు-నేడుపై ప్రభుత్వం అన్నీ అబద్ధాలే చెప్పిందని అన్నారు.

ప్రభుత్వ పెద్దల తగాదాలో ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పి) పంపిణీ ఆగిపోయిందన్నారు. 8022 ఇంగ్లీషు ల్యాబ్స్ అన్నారని, నిర్మాణం సున్నా అని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బి శ్రీనివాస్ యాదవ్, నాయకులు జి వెంకటేశ్వరరావు, బి రామకృష్ణ, పోతిన వెంకట మహేష్, నేరెళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయండి

- బొప్పరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో డిసెంబరు 10న జరగనున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మహాసభ పోస్టరును విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యల సాధన కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ సుమన్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ప్రైవేటు ఏజెన్సీల కబంధ హస్తాల్లో శ్రమ దోపిడీకి గురైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఊరటనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటుచేసి కొంతమేర రక్షణ కల్పించిందన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్

- టిటిడిలో 114 జిఒ అమలుకు గ్రీన్ సిగ్నల్
- స్విమ్స్‌లో రూ.197 కోట్లతో భవనాలు నిర్మాణం
- టిటిడి పాలకమండలి నిర్ణయం



పాలక మండలి సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి చైర్మన్, పక్కన ఇఒ, బోర్డు మెంబర్స్

ప్రజాశక్తి- తిరుమల

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు టిటిడి పాలకమండలి అంగీకారం తెలిపింది. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్న ప్రభుత్వ జిఒ నంబర్ 114 మేరకు అర్హత ఉన్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని పాలకమండలి ప్రకటించింది. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పాలకమండలిలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నిర్ణయాలను చైర్మన్ వెల్లడించారు. ఈ నెల 23 నుంచి అలిపిరి వద్ద శ్రీనివాస దివ్యానుగ్రహ హోమాన్ని నిర్వహించనున్నామని, హోమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తామని, హోమంలో పాల్గొనే యాత్రికులు రూ. వెయ్యి చెల్లించి టికెట్టు పొందవలసి ఉంటుందని తెలిపారు. టిటిడి ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించిన వడమాలపేట వద్ద గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.25.67కోట్లు కేటాయిస్తున్నామని, ఈ సొమ్మును తిరిగి ఉద్యోగులు నుంచి రీయింబర్స్ చేసుకుంటామని చెప్పారు. టిటిడిలో పని చేసే ప్రతి ఉద్యోగికి ఇంటిస్థలం కేటాయిస్తామన్నారు. అర్హత ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామని, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కాంట్రాక్ట్, కార్పోరేషన్ పరిధిలో ఉన్న ఉద్యోగులను అర్హత మేరకు రెగ్యులరైజ్ చేస్తామని ఇఒ ధర్మారెడ్డి తెలిపారు.

మరికొన్ని నిర్ణయాలు

టిటిడి ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానంగా రూ.14 వేలు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.6850 ఇవ్వాలని ఆమోదం.తిరుపతిలోని రామ్‌నగర్ క్వార్టర్స్ అభివృద్ధి పనులకు రూ.6.15 కోట్లు కేటాయింపు. ప్రసాదాలు, ముడిసరుకులు నిల్వ ఉంచడానికి రూ.11కోట్లతో అలిపిరి వద్ద గోడౌన్లు నిర్మాణానికి నిధులు మంజూరు.

మంగళం నుంచి రేణిగుంట వరకు రోడ్డు అభివృద్ధి పనులకు రూ.15 కోట్లు, ఎంఆర్‌పల్లి జంక్షన్ నుంచి అన్నమయ్య వరకు రోడ్డు అభివృద్ధి పనులకు రూ.4.5 కోట్లు, పుదిపట్ల జంక్షన్ నుంచి వకులమాత ఆలయం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.21 కోట్లు కేటాయింపుకు ఆమోదం.

ఆయుర్వేద హాస్పిటల్‌లో రూ.1.65 కోట్లతో నూతన భవనం నిర్మాణం. రుయాలో టిబి రోగుల కోసం రూ.1.79కోట్లతో నూతన వార్డు నిర్మాణం. స్విమ్స్‌లో రూ.3.35 కోట్లతో నూతన భవనాలు నిర్మాణం. స్విమ్స్‌లో నూతన కార్డియో, న్యూరో బ్లాక్‌ల ఏర్పాటుకు రూ.74 కోట్లు కేటాయింపు. స్విమ్స్‌లో రూ.197కోట్లతో నూతన ఆధునాతమైన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు.

నడకదారిలో యాత్రికులు భద్రత కోసం రూ.3.5 కోట్ల వ్యయంతో ట్రాప్ కెమెరాలు కొనుగోలు. కరీంనగర్‌లో పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి రూ.15.54 కోట్లు కేటాయింపు. ప్రాచీనకళలు ప్రోత్సహించడానికి కలంకారి, శిల్పకళల కోసం సాయంకాలం కోర్సులు ప్రారంభానికి ఆమోదం.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంత్యోత్సవాలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం (ఆంధ్రరత్న భవన్)లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూకు పిల్లలంటే ఎంతో ప్రాణమని, అందుకనే ఆయన జయంతిని దేశ ప్రజలందరూ బాలల దినోత్సవంగా జరుపుకుంటారని కాంగ్రెస్ విజయవాడ సిటీ అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు తెలిపారు. దేశానికి నెహ్రూ చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని యువతరం జాతీయాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

ఎయుకు నాక్ ఎ + + ర్యాంకు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



ఆంధ్ర విశ్వవిద్యాలయం కొత్త చరిత్రను లిఖించింది. దేశంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా నిలిచే అత్యున్నత ఘనతను సాధించింది. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్‌ఎఎసి) ఈ వర్సిటీకి నాక్ ఎ ++ ర్యాంక్‌ను ఇచ్చింది. ఇదే క్రమంలో ఎయు 3.74 గ్రేడింగ్ సాధించింది. మంగళవారం ఉదయం ఎయు అకడమిక్ సెనేట్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వర్సిటీ వైస్ ఛాన్సలర్ పివిజిడి.ప్రసాదరెడ్డి వెల్లడించారు. విశ్వవిద్యాలయాల విభాగంలో దేశంలో ఇప్పటి వరకు కేవలం మూడు వర్సిటీలు మాత్రమే 3.70 స్కోర్‌ను దాటాయని, వీటిలో ఎయు ఉండటం గొప్ప విషయమని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు రానున్న ఏడు సంవత్సరాలకు అమలులో ఉంటుందని చెప్పారు. క్వాలిటేటివ్ ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా నాక్‌కు చెందిన ఏడుగురు సభ్యులు ఎయులో ప్రతి విభాగాన్నీ, సమాచారాన్నీ ప్రత్యక్షంగా పరిశీలించి ర్యాంకింగ్‌ను అందించారన్నారు. అత్యుత్తమ నాక్ ర్యాంక్ ఫలితంగా ఎయు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదాకు దరఖాస్తు చేసే అవకాశం సాధించిందని తెలిపారు. అదే విధంగా విదేశాలలో సైతం తమ క్యాంపస్‌ను ప్రారంభించే అవకాశం లభిస్తుందన్నారు. రీసెర్చ్ నిధులు మంజూరుకు ఈ ర్యాంకింగ్ ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని చెప్పారు.. భవిష్యత్తులో విదేశీ విద్యార్థులు సైతం పెద్దసంఖ్యలో ఎయులో చేరడానికి ఆసక్తి చూపుతారన్నారు. కార్యక్రమంలో ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఫలితాల్లో పవిత్ర ప్రతిభ

ప్రజాశక్తి- రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండల కేంద్రానికి చెందిన ముప్పన పవిత్ర ఎయిమ్స్‌లో ప్రతిభ కనబరిచింది. ఇటీవల విడుదలైన ప్రవేశ పరీక్షల్లో 99.5 శాతం మార్కులు పొంది 304వ ర్యాంకు సాధించింది. ఆమె హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసింది. తాజా ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించిన ఆమె ఢిల్లీ ఎయిమ్స్ కళాశాలలో వైద్య విద్యలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేయడమే తన లక్ష్యమని పేర్కొంది. తన కుమార్తె ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందని ఆమె తండ్రి అమర్‌నాథ్ మీడియాకు తెలిపారు.



'పర్యాటక' సమ్మె తాత్కాలిక విరమణ

ప్రజాశక్తి - అరకులోయ, అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ (ఎపి టూరిజం) కార్మికులు తాత్కాలికంగా సమ్మె విరమించారు. జీతాల పెంపుదల సహా పలు డిమాండ్లతో టూరిజం కార్మికులు సమ్మెకు దిగడంతో అరకులోయలోని మయూరి హరిత రిసార్ట్, హరిత వ్యాలీ రిసార్ట్, అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు, టైడా జంగిల్ బెల్స్, అనంతగిరి హరిత హిల్ యూనిట్లు మూతపడిన విషయం తెలిసిందే. రోజురోజుకూ ఆందోళన ఉధృతమవుతున్న నేపథ్యంలో మంగళవారం అధికారులు దిగివచ్చారు. అరకులోయలోని యాత్రా నివాస్‌లో టూరిజం కార్మికులతో చర్చలు జరిపారు. డిసెంబరు నాటికల్లా సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో నాలుగు రోజులుగా చేస్తున్న సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు కార్మికులు ప్రకటించారు. ప్రభుత్వం, అధికారులు మాట తప్పితే మరలా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

ఈ చర్చల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అరకు ఎమ్మెల్యే ఫాల్గుణ, ఎమ్మెల్సీ కె.రవిబాబు, టూరిజం ఆర్‌డి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్మికుల తరుపున ఎపి టూరిజం కాంట్రాక్టు, మ్యాన్‌పవర్ అండ్ డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గంగరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు బాబూరావు, వనాది, జిల్లా నాయకులు రాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సంపాదకీయం

మితవాద రాజకీయాలకు పరాకాష్ఠ!

బ్రిటన్‌లో అసహ్యకరమైన విభజన, విద్వేష రాజకీయాలను బాహాటంగా ప్రేరేపించిన హోం మంత్రి సుయెల్లా బ్రేవర్‌మన్‌కు సునాక్ ఉద్వాసన పలకడం స్వాగతించదగ్గ పరిణామం. 2024 పార్లమెంటు ఎన్నికల్లో కన్సర్వేటివ్ పార్టీలో సునాక్ నాయకత్వాన్ని సవాల్‌చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్న ఈ ఆఫ్రికన్-భారతీయ సంతతి మహిళ డౌన్‌స్ట్రీట్ నంబర్ 10ను ధిక్కరించి 'టైమ్స్'లో రాసిన వ్యాసంతో మొదలైన వివాదం ఆమె నిష్క్రమణ తరువాత కూడా సమసిపోయేలా లేదు. బ్రేవర్‌మన్ రాసిన ఆ వ్యాసంలో పాలస్తీనా సంఘీభావ ర్యాలీని క్రూరంగా అణచివేయడంలో మెట్రో పోలీసులు అలసత్వం వహించారని నిందించారు. అంతటితో ఆగలేదు, ఆ ప్రదర్శనలో పాల్గొన్నవారంతా ఇస్లామిక్ ఉగ్రవాద గ్రూపులు, హమాస్‌తో సంబంధమున్నవారేనని అవాకులు చవాకులు పేలారు. ఆమె వ్యాఖ్యలపై అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు రావడం, గత శనివారం బ్రిటన్‌లో లక్షలాది మందితో జరిగిన ర్యాలీలో బ్రేవర్‌మన్‌ను తక్షణమే తొలగించాలన్న నినాదాలు హోరెత్తడం, పార్టీలో అంతర్గత ముఠా కుమ్ములాటలు వెరసి ఆమె ఉద్వాసనకు కారణమయ్యాయి. అంతే తప్ప వీరి మధ్య సైద్ధాంతికపరమైన విభేదాలేమీ లేవు. పేచీ అంతా ఆ ఉద్యమాన్ని ఎప్పుడు, ఎలా అణచివేయాలన్నదానిపైనే. భద్రత పేరుతో నిరసనలపై ఉక్కుపాదం మోపేందుకు నిరంకుశ పబ్లిక్ ఆర్డర్ యాక్ట్‌ను ఇద్దరూ కూడబలుక్కుని తీసుకొచ్చారు.. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని లక్షలాది మంది నినదిస్తుంటే సునాక్ ఇజ్రాయిల్ వెళ్లి నెతన్యాహు ప్రభుత్వానికి వత్తాసు పలికి వచ్చారు. దేశంలో ప్రైవేటీకరణ, నిరుద్యోగం, పడిపోతున్న నిజవేతనాలు, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా అన్ని రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు సమ్మెలు, ఆందోళనలకు దిగుతున్నారు. ఆర్థిక వ్యవస్థలో తలెత్తిన సంక్షోభం రాజకీయ అస్థిరతకు దారి తీసింది. ఏడాది వ్యవధిలోనే ముగ్గురు ప్రధానులు మారడం ఇందుకొక సంకేతం. కన్సర్వేటివ్ ప్రభుత్వం పట్ల బ్రిటిష్ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు సునాక్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ డ్రామాకు తెర లేపారు. మంత్రివర్గం నుంచి బ్రేవర్‌మన్‌ను తొలగించిన వెంటనే న్యూ కన్సర్వేటివ్ ఫ్యాక్షన్ సమావేశమై ఆమె నాయకత్వాన్ని పటిష్టపరచే యత్నాలు చేపట్టినట్టు 'ది గార్డియన్' పత్రిక కథనం రాసింది. సునాక్ నాయకత్వానికి సొంత పార్టీ నుంచే సవాళ్లు ఎదురవుతున్నాయని 'మెయిల్' వ్యాఖ్యానించింది. బ్రేవర్మన్ హోం మంత్రిగా తప్పుకోవాల్సి రావడం ఇది రెండోసారి. లిజ్‌ట్రస్ మంత్రివర్గం నుంచి కూడా ఆమె గతంలో ఒకసారి తప్పుకున్నారు. పలు కీలకాంశాలపై ట్రస్ సర్కారు అయోమయంలో ఉందని ఆమె బాహాటంగానే విమర్శించడం అప్పుడు పెద్ద దుమారాన్ని రేపింది. వలసలకు సంబంధించి అధికార పత్రాలను నిబంధనలకు విరుద్ధంగా సహచర పార్టీ ఎంపికి చూపించిన అంశంలో ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది.

'బ్రిటన్‌లో వీసా కాలపరిమితి ముగిసిన వలసవాసులను రువాండాకు తరలిస్తాం. శరణార్థుల తాకిడిని వలసదారుల దండయాత్ర' లాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా కన్జర్వేటివ్ పార్టీలో కరడుగట్టిన మితవాదులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారామె. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలు, ఒపీనియన్ పోల్స్ కన్సర్వేటివ్ పార్టీ పలుకుబడి బాగా పడిపోతున్నట్లు వెల్లడిస్తున్నాయి. సంక్షోభాన్ని తనకు అనుకూలంగా మలచుకుని వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా బాధ్యతలు చేపట్టాలని ఆమె ఉవ్విళ్లూరుతున్నారు. దీనికి చెక్ పెట్టేందుకు మాజీ ప్రధాని డేవిడ్ కెమరాన్‌ను అనూహ్యమైన రీతిలో మంత్రి వర్గంలోకి సునాక్ తీసుకున్నారు. 2016 నుంచి క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న వ్యక్తిని హడావుడిగా ఎగువ సభ సభ్యత్వం ఇచ్చి విదేశాంగ మంత్రిగా నియమించారు. ఇప్పటివరకు విదేశాంగ మంత్రిగా ఉన్న జేమ్స్ క్లెవరీని హోం మంత్రిగా నియమించారు. బ్రెగ్జిట్‌పై రిఫరెండమ్ తనకు వ్యతిరేకంగా రావడంతో 2016లో పదవి నుంచి తప్పుకున్న కెమరాన్‌పై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అటువంటి వ్యక్తిని తీసుకొచ్చి విదేశాంగమంత్రిగా నియమించడం వల్ల సునాక్ ప్రతిష్ట మరింత మసకబారుతుందే తప్ప మెరుగుపడదు. కన్సర్వేటివ్స్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న కీర్ స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ కూడా నెతన్యాహును వెనకేసుకొస్తున్నది. రేపు లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చినా కార్పొరేట్లు, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే పని చేస్తుంది. ఈ రెండు పార్టీల వ్యవస్థను బద్దలు కొట్టి వామపక్ష ప్రజాతంత్ర శక్తులతో మరో ప్రత్యామ్నాయం నిర్మించడమే మార్గం. బ్రిటన్‌లో నేడు సాగుతున్న ప్రజా ఉద్యమాలు అటువంటి మార్పులకు దారి తీస్తాయని ఆశిద్దాం.

మహనీయుల మాట



సిద్ధాంతాలు లేని జీవితాన్ని గురించి చెప్పుకోవడానికి ఏమీ ఉండదు. వాటి కోసం పోరాడటాన్ని మించిన గొప్ప ఆనందం మరొకటి ఉండదు.

- ఫైడల్ కాస్ట్రో

ప్రజా పోరులో సిపిఎం రక్షణభేరి

విశ్లేషణ



వి. రాంభూపాల్



రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం మౌళికంగా చేపట్టాల్సిన విధానాలు, తక్షణం ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యల కోసం సిపిఎం ప్రజా ప్రణాళిక రూపొందించింది. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి పోలవరం పూర్తి చేయడం, ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చేందుకు ప్రణాళికలు, బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కొనసాగించడం, ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డుతో పాటు బ్యాంకు రుణం గ్యారంటీగా అమలు చేయడం, స్వామినాథన్, జయతీ ఘోష్, రాధాకృష్ణ కమిషన్‌ల సిఫార్సుల అమలు చేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలి. భూమి లేని వ్యవసాయ కూలీలకు రెండు ఎకరాల భూమి, పరిశ్రమల పేరుతో సేకరించిన వేలాది ఎకరాల భూమి పడావుగా ఉంది. ఆ భూములను తిరిగి రైతులకు అప్పగించాలి. అటవీ సంరక్షణ చట్ట సవరణ రద్దు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి.

ఒకనాటి రాష్ట్ర రాజకీయ రాజధాని విజయవాడ అరుణారుణం అవుతున్నది. ప్రజాశక్తికి ప్రతిరూపంగా అనేక సభలకు నిలయంగా భాసిల్లిన నాటి బెజవాడలో నేడు మరోసారి ప్రజాపోరు నగారా మోగనుంది. వేలాది శ్రమజీవులు స్వంత ఖర్చులతో, సద్దిమూటలతో, చంటిబిడ్డలతో ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలతో విజయవాడలో బారులు తీరనున్నారు. 'ఇంకెక్కడ కమ్యూనిస్టులు?' అన్న నోళ్ళు మూయించనున్నారు. ఆంధ్రదేశ రాజకీయ రాతలను మార్చిన నాటి పోరుగడ్డపై సిపిఎం ప్రజా రక్షణభేరి లాంగ్ మార్చ్ చేయనుంది. రాజకీయం అంటే ప్రజల జీవితాలను మార్చడమని, అసమానతలు లేని అభివృద్ధి సాధించడమని, కోట్లాది పీడిత, తాడిత జనావళి భవిష్యత్‌కు గ్యారంటీ ఇవ్వడమని చాటనుంది. అందుకు పరిష్కార మార్గం పోరాటమే అని గర్జించనుంది.

గాడి తప్పిన రాష్ట్ర రాజకీయం

రాష్ట్ర విభజన జరిగి సుమారు పది సంవత్సరాలు అవుతున్నది. ఈ కాలంలో రాష్ట్రంలోని రెండు ప్రధాన రాజకీయ పార్టీలు చెరో సగం కాలం పాలించాయి. నాడు విభజన భజన చేసి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మా ణం అంటూ నాటకీయంగా కీర్తనలు ఆలపించిన నాటి బిజెపి ఈ కాలమంతటా దేశాన్ని పాలిస్తున్నది. ప్రపంచ రాజధాని, వరం లాంటి పోలవరం, పరుగు పందెంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి అంటూ రంకెలు వేసిన ఈ పాలకులంతా నాటి విభజనకు కారకులే. నేటికీ దిక్కుమొక్కు లేని రాజధాని, నిర్వాసితులకు శాపంగా మారిన పోలవరం, కేంద్ర గద్దలు మింగిన ప్రత్యేక హోదా, ఏడుకొండలు ఎక్కిన విభజన హామీల అమలు ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి తీరని ఆటంకాలు. అందుకే రాష్ట్ర పునర్విభజన జరిగి దశాబ్దం గడచినా ప్రజానీకాన్ని వెంటాడుతున్న కరువులు, వలసలు, ఆత్మహత్యలు, నిరుద్యోగం, సామాజిక అణచివేతలు, ప్రాంతీయ అసమానతలు పెరిగాయే తప్ప తరగలేదు.

రాష్ట్రానికి ద్రోహం చేసిన కేంద్రానికి రాష్ట్ర పాలక పార్టీలు దాసోహం అంటూ మరింత వెనుకబాటుకు కారణం అవుతున్నాయి. చట్ట ప్రకారం సాధించాల్సిన వాటిని చుట్టరికంతో తాకట్టు పెడుతున్నాయి. అన్ని బొమ్మలను ఒకడే ఆడించే తోలుబొమ్మలాట లాగా రాష్ట్రంలోని అన్ని పాలక పార్టీలను కేంద్ర బిజెపి ఆడిస్తున్నది. రాజధర్మం ప్రకారం చేయాల్సిన పనులు, ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోగా కృష్ణాజలాల పున:పంపిణీ లాంటి సున్నిత అంశాలను తిరగదోడి దశాబ్దం క్రితం నాటి ప్రాంతీయ గాయాలను మరల రగిలించేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ పది సంవత్సరాల కాలంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న బిజెపి నేడు హఠాత్తుగా అవినీతి, ఇసుక, మద్యం గురించి మాట్లాడుతున్నది. దొంగే దొంగ దొంగ అంటే ఏమో అనుకున్నాం. ఇదేనన్నమాట!

ఇక మన రాష్ట్రంలోని వైసిపి, టిడిపిల పరిస్థితి ఆంధ్ర రాష్ట్ర రాజకీయ చరిత్రకే మచ్చ తెచ్చాయి. ఢిల్లీ పెత్తనాన్ని ప్రశ్నించి తెలుగు ఆత్మగౌరవాన్ని చాటి ప్రజాదరణ పొందిన నాయకుల వారసులుగా చెప్పుకునే వైసిపి, టిడిపిలు తమ స్వార్థ రాజకీయాల కోసం ఢిల్లీలో తమ రాజకీయ విధానాన్ని పదేపదే తాకట్టు పెట్టుకుంటున్నాయి. మతోన్మాదం గురించి భీకరంగా మాట్లాడిన వారే నేడు ఆ ఉన్మాదుల దర్శనభాగ్యం దొరకడంతో తన్మయత్వం చెందుతున్నారు. నా ఎస్.సిలు, నా మైనారిటీలు అని రాగాలాపన చేస్తున్న వారు ఆ ఎస్.సి లను, ఆ మైనారిటీలను అణచివేస్తున్న ఉన్మాదుల పక్షాన నిలబడి చిద్విలాసం చేస్తున్నారు. ప్రజలపై వేసే భారాలను, ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసే వినాశకర విధానాలను పోటీలు పడి పార్లమెంట్‌లో ఆమోదిస్తున్నారు. ప్రశ్నిస్తానంటూ వచ్చిన పవన్ గాలికంటే వేగంగా విధానాలను మార్చుకుంటూ నిలకడలేని నేతగా మిగిలిపోయారు. పురాణాల్లోని ధృతరాష్ట్ర కౌగిలి ఏమిటోగాని...నేడు కేంద్ర నేతల ఆలింగనం ప్రాంతీయ పార్టీల అంతానికి ఆరంభం అన్నది వర్తమాన సత్యం.

కపటపు విధానాల నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ శక్తి మేరకు ఆంధ్ర రాజకీయాలను కుల రాజకీయాలుగా, విద్వేష రాజకీయాలుగా మారుస్తున్నారు. ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి చోటే లేని అసభ్య విమర్శలు, అనాగరిక ప్రవర్తనలు, బూతు పురాణాలకు తెగబడుతున్నారు. రాజకీయమంటే ప్రజల జీవితాలను మార్చడం, నిజాయితీగా ప్రజలకు సేవలు అందించి నిన్నటి కంటే నేడు, నేటి కంటే రేపు మెరుగు చేయడమనే అర్థం మారిపోయింది. నిన్నటి కంటే నేడు, నేటి కంటే రేపు మరింతగా దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను చీల్చడం, స్వార్థం కోసం రాష్ట్రాన్ని బలిపెట్టడం నేటి రాజకీయంగా మారింది. అందుకే ఆంధ్ర రాష్ట్రం అధోగతికి చేరుకున్నది. దీన్ని మార్చాలి. వ్యక్తిగత విమర్శల చుట్టూ, పదవుల పందేరాల చుట్టూ కాదు చర్చలు జరగాల్సింది. విధానాల గురించి చర్చ జరగాలి. ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాటాలు సాగాలి. ఆ పోరాటాలే ప్రజల జీవితాలను మార్చాలి. అందుకే సిపిఎం అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజా రక్షణభేరి చేపట్టి తన రాజకీయ విశిష్టతను చాటింది. నెలన్నర రోజులుగా రాష్ట్రం నలుచెరుగుల లక్షలాది జనాన్ని కలిసింది, ప్రజా ప్రణాళిక గురించి విస్తృతంగా వివరించింది. పోరుకు కదిలి రమ్మని పిలుపునిచ్చింది.

విధానాల మార్పు కోసం సిపిఎం

రాష్ట్ర రాజకీయాలు ఎన్నికల చుట్టూ తిరుగుతున్నాయి. జైలయినా, బెయిలైనా, పాద యాత్రైనా, బస్సు యాత్రైనా ఎన్నికల కోసమే. మాట్లాడినా, మాట్లాడకున్నా ఎన్నికల కోసమే. ఎన్నికలే సర్వస్వం. మరోసారి ప్రజలను దగా చేసి అధికారాన్ని కబ్జా చేయడం కోసం పోటాపోటీలు, సినిమా డైలాగులు, ప్రచార హోర్డింగ్‌లు. ఈ పోరులో నలిగేది, కుమిలేది పేదలే. అందుకే ఆ పేదల, కష్టజీవుల బతుకుల గురించి, ఆంధ్ర రాష్ట్రాభివృద్ధి గురించి సిపిఎం పోరాడుతోంది. భూ సేకరణ అక్రమాలపై, సెజ్‌ల అరాచాకలపై, కార్మిక, కర్షక సమస్యలపై నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తున్నది. ప్రజాసమస్యల చుట్టూ రాజకీయ చర్చ జరగాలి, ప్రజా సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడేటట్లు చేయాలి. అందరూ నడిచే దారిలో నడవడానికి ఏ కష్టం అక్కరలేదు. సరైన మార్గం వైపు నడవాలంటే స్పష్టమైన విధానాలు, అంతకు మించిన సైద్ధాంతిక పటుత్వం ఉండాలి. ఆ బాధ్యతను సిపిఎం తీసుకుంది. అందుకోసం ప్రజామార్గం ఎన్నుకుంది.

ఇటీవల పోలవరం నిర్వాసితుల సమస్యపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేలాది గిరిజనులు విజయవాడ వరకు పాదయాత్ర నిర్వహించారు. కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, అనంతపురం, కృష్ణా మొదలగు అనేక జిల్లాల్లో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నిర్దిష్ట ప్రత్యామ్నాయాలతో పాదయాత్రలు, స్కూటర్ యాత్రలు చేపట్టి లక్షలాది ప్రజానీకాన్ని సిపిఎం శ్రేణులు కలిశాయి. రాష్ట్రవ్యాప్త సమస్యలపై ఒక్కో జిల్లాల్లో ఒక్కో అంశంపై 19 జిల్లాలో రాష్ట్ర సదస్సులు నిర్వహించాయి. ఇందులో వామపక్ష పార్టీలు, మేధావులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొని ఆ యా అంశాలపై చర్చించి ప్రతిపాదనలు రూపొందించారు. అక్టోబర్ 7,8 తేదీలలో విజయవాడలో రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించి ప్రజాప్రణాళికకు తుది రూపం ఇచ్చింది. అక్టోబర్ 30 నుండి రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుండి బస్సుయాత్రలు బయలుదేరాయి. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న ద్రోహాన్ని, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల అవకాశవాద వైఖరులను వివరిస్తూ రాష్ట్ర నలుమూలల జరిగిన వందలాది సభల్లో జాతీయ, రాష్ట్ర నాయకులు ప్రజలకు వివరించారు.

సిపిఎం ప్రజా ప్రణాళిక

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం మౌళికంగా చేపట్టాల్సిన విధానాలు, తక్షణం ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యల కోసం సిపిఎం ప్రజా ప్రణాళిక రూపొందించింది. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి పోలవరం పూర్తి చేయడం, ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చేందుకు ప్రణాళికలు, బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కొనసాగించడం, ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డుతో పాటు బ్యాంకు రుణం గ్యారంటీగా అమలు చేయడం, స్వామినాథన్, జయతీ ఘోష్, రాధాకృష్ణ కమిషన్‌ల సిఫార్సుల అమలు చేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలి. భూమి లేని వ్యవసాయ కూలీలకు రెండు ఎకరాల భూమి, పరిశ్రమల పేరుతో సేకరించిన వేలాది ఎకరాల భూమి పడావుగా ఉంది. ఆ భూములను తిరిగి రైతులకు అప్పగించాలి. అటవీ సంరక్షణ చట్ట సవరణ రద్దు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి.

విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించడం, కడప ఉక్కు పరిశ్రమను స్థాపించడం, అమరావతిలోనే రాజధాని నిర్మాణం పూర్తి చేయడం, ఐ.టి, ఫార్మా, టెక్స్‌టైల్స్, జూట్, పేపర్, అగ్రి, సినీ పరిశ్రమల అభివృద్ధికి నిర్దిష్ట కాలపరిమితితో చర్యలు చేపట్టాలి. స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలి. సహకార వ్యవస్థను పటిష్టం చేయాలి. మెగా మాల్స్‌పై ఆంక్షలు విధించి చిన్న వ్యాపారులను రక్షించడం, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలి. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ఓపిఎస్ పునరుద్ధరణ చేయాలి. 40 వేల టీచర్ల పోస్టులను, ఖాళీగా ఉన్న 2 లక్షల 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి. నిరుద్యోగులకు నెలకు రూ.5 వేలు భృతి ఇవ్వాలి. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, కులగణన, ఎస్.సి. ఎస్.టి, మైనారిటీ సబ్‌ప్లాన్ అమలుకు జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు చేయాలి. వృత్తుల రక్షణకు చర్యలు చేపట్టాలి. బి.సిల అభివృద్ధికి సబ్‌ప్లాన్ అమలు చేయాలి.

వెనుకబడిన ప్రాంతాలకు నిర్దిష్ట కాల పరిమితితో లక్ష కోట్లతో ప్రత్యేక ప్యాకేజి, అభివృద్ధి చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ రంగంలో విద్య, వైద్యం అందించి, కార్పొరేట్ వ్యాపారాన్ని అరికట్టాలి. వైద్య రంగంలో సుజాతారావు కమిటీ సిఫార్సులు అమలు చేయాలి. కరెంట్ యూనిట్ రూపాయికే ఇవ్వాలి. పేదలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వాలి. స్మార్ట్‌మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి. పవన, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో కార్పొరేట్ కంపెనీలను నియంత్రించాలి. రూ.400 కు గ్యాస్, రూ. 60 కు లీటర్ పెట్రోల్, డీజల్ ఇవ్వాలి. ప్రతి మనిషికి నెలకు 10 కేజీల బియ్యాన్ని ఉచితంగా ఇవ్వాలి. నిత్యావసర సరుకులను ప్రజాపంపిణీ ద్వారా అందచేయాలి. 2 సెంట్ల ఇళ్ళు, రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేయాలి. అన్ని రకాల పెన్షన్లు రూ. 5 వేలు ఇవ్వాలి. ఈ ప్రజా ప్రణాళిక అమలుకు నవంబర్ 15న (బుధవారం) విజయవాడలో జరుగుతున్న ప్రజారక్షణ భేరి సభ మూలమలుపుగా నిలిచితీరుతుంది.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

★

వారానికి డెబ్బయి గంటల పని!

సమస్య



ఆర్. కరుమలయన్



తమ హిందూత్వ-బడా కార్పొరేట్ కూటమి ఎజెండాకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మలచడం తమ పనిగా నారాయణమూర్తి వంటి వారు పెట్టుకున్నారు. సంపదను సృష్టించడంలో తమ శ్రమశక్తిని, తమ నైపుణ్యాలను, తమ శారీరక, మానసిక సామర్థ్యాలను ధారపోసే కార్మికుల పట్ల పెట్టుబడిదారులకు ఏమాత్రమూ గౌరవం ఉండదని, ఒక పని రోజులో కార్మికుడి నుండి ఎంత శ్రమశక్తిని గరిష్టంగా పిండుకోవాలో దాని గురించి మాత్రమే పెట్టుబడిదారుడు పట్టించుకుంటాడని మార్క్స్ చెప్పాడు. ఆ క్రమంలో కార్మికుల ఆయువు తగ్గిపోయినా పెట్టుబడిదారుడికి ఏ ఖాతరూ లేదు.

ఇన్ఫోసిస్ సంస్థ సహ-వ్యవస్థాపకుడు, ఐటి రంగ దిగ్గజం, శతకోటీశ్వరుడు అయిన నారాయణమూర్తి వారానికి 70 గంటలు పని చేయాలని ఇటీవల పిలుపిచ్చారు. దేశం అభివృద్ధి చెందాలంటే భారతీయ యువత పని సంస్కృతిలో పెద్ద మార్పు రావాలని అన్నారు. ఇలా ఎక్కువ గంటలపాటు పని చేయాలని చెప్పడం ఆ పెద్దమనిషికి ఇదే మొదటిసారి కాదు. 2020లో వారానికి 60 గంటల పని ఉండాలని ప్రకటించారు. ప్రపంచ స్థాయి పోటీలో నిలదొక్కుకోవాలంటే ఉద్యోగుల ఉత్పాదకతను పెంచాలని, అప్పుడే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందగలుగుతుందని, తనదైన ఒక నిర్ధారణకు నారాయణమూర్తి వచ్చారు. ఆ నిర్ధారణకు ఎటువంటి ప్రాతిపదికా లేదు. అతడి ఆలోచనలు మోడీ ప్రభుత్వపు భ్రష్టు పట్టిపోయిన దృక్పధాన్ని ప్రతిధ్వనిస్తున్నాయి.

"భారతదేశంలో శ్రామిక ఉత్పాదకత ప్రపంచం లోనే అతి తక్కువ స్థాయిలో ఉంది. కాబట్టి భారతీయులందరూ క్రమశిక్షణను అలవరచుకుని పనిలో ఉత్పాదకతను పెంచాలి" అని నారాయణమూర్తి నొక్కి వక్కాణించారు. వెంటనే అతడి ప్రకటన మీడియాలో వైరల్ అయింది. ఆ వెంటనే భవిష్ అగర్వాల్ (ఓలా క్యాబ్స్ అధినేత), సజ్జన్ జిందాల్ (జిందాల్ స్టీల్ వర్క్స్ అనే బహుళజాతి పారిశ్రామిక గ్రూపు చైర్మన్) వంటి వారు ఆ ప్రకటనను స్వాగతిస్తూ తమ మద్దతు ప్రకటించారు.

ప్రస్తుతం మన దేశంలో ఉనికిలో ఉన్న కార్మిక చట్టాల ప్రకారం మన కార్మికులు వారానికి 48 గంటలపాటు పని చేయాలి. వారంలో ఒకరోజు శలవు ఉంటుంది. తక్కిన దేశాల్లో ఉన్న నిబంధనలతో పోల్చితే మన కార్మికులు ఇప్పటికే అధిక పని భారం మోస్తున్నారన్న చేదు నిజం కానవస్తుంది. ఐఎల్‌వో 2023లో విడుదల చేసిన గణాంకాల ప్రకారం, భారతదేశంలో కార్మికులు వారానికి సగటున 47.7 గంటల పాటు పని చేస్తున్నారు. అదే అమెరికాలోనైతే సుమారు 36.4 గంటలు, దక్షిణ కొరియాలో 37.9 గంటలు, రష్యాలో 37.6 గంటలు, బ్రిటన్ లో 36 గంటలు, జర్మనీలో 37 గంటలు సగటున పని చేస్తున్నారు.

ప్రపంచం లోనే ఎక్కువ పని గంటలు అమలు అవుతున్న దేశాల్లో భారతదేశం ఐదవ స్థానంలో ఉందని ఐఎల్‌వో నివేదిక వెల్లడిస్తోంది. మనకన్నా ఎక్కువ పనిగంటలు అమలౌతున్న దేశాలు గాంబియా, మంగోలియా, మాల్దీవులు, కతార్. ఈ దేశాల్లో ఎక్కువమంది కార్మికులు భారతదేశం నుండి వలస పోయినవారే. అదే సమయంలో ఆసియా-పసిఫిక్ ప్రాంతం మొత్తంలో అతి తక్కువ వేతనాలు పొందుతున్న వారు భారతీయ కార్మికులే. ఒక్క బంగ్లాదేశ్ లో మాత్రమే కనీసవేతనాలు మనకన్నా తక్కువ ఉన్నాయి. 2020-21కి సంబంధించి ప్రపంచ వేతనాల నివేదిక ఈ వాస్తవాలను తెలియజేసింది.

ఆ యా దేశాల్లో అమలు జరిగిన పారిశ్రామికీ కరణ స్థాయి, దాని వేగం, అక్కడ ఉన్న సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి అంశాలను పరిగణన లోకి తీసుకోకుండా వేరు వేరు దేశాల కార్మికుల ఉత్పాదకతను పోల్చి చూడడం శాస్త్రీయత అనిపించుకోదు. కాని, ఒక సగటు భారతీయ కార్మికుడు ఒక జపాన్ కార్మికుడికన్నా, లేదా ఒక జర్మనీ కార్మికుడికన్నా తక్కువ పని చేస్తాడని నారాయణమూర్తి చెప్తున్నదానికి ఏ ఆధారమూ లేదు. 1970లో భారతీయ కార్మికుడు సగటున ఏడాదికి 2077 గంటలు పని చేశాడు. అదే ఏడాదిలో జర్మన్ కార్మికుడి సగటు 1941 గంటలు ఉంటే జపాన్ కార్మికుడు 2137 గంటలు పని చేశాడు. అదే 2017 నాటికి భారతీయ కార్మికుడి ఏడాది సగటు 2117 గంటలు ఉంటే జపాన్ లో 1738 గంటలు, జర్మనీలో 1354 గంటలు ఉంది. జర్మన్ కార్మికుల కన్నా, జపాన్ కార్మికుల కన్నా మన కార్మికులు తక్కువ కష్టపడతారన్నది కేవలం దురభిప్రాయం మాత్రమే అని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

మన ప్రభుత్వం 2019లో ప్రచురించిన నివేదిక ప్రకారం 15 నుండి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న భారతీయ పట్టణ కార్మికులు సగటున ఒక్కొక్కరు రోజుకు 521 నిముషాలు చొప్పున, వారానికి 60 గంటల 47 నిముషాల చొప్పున పని చేస్తున్నారు. ఐఎల్‌వో నిర్దేశించిన వారానికి 48 గంటల పరిమితిని దాటిపోయి మన కార్మికులు పని చేస్తున్నారు. పని దినం నిడివిని బాగా పెంచి మన పెట్టుబడిదారులు ఎంత దారుణంగా కార్మికుల శ్రమను కొల్లగొడుతున్నారో ఈ వివరాలు వెల్లడి చేస్తున్నాయి. "ఆకలిగొన్న తోడేళ్ళ" మాదిరిగా పెట్టుబడిదారులు కార్మికులనుండి అదనపు విలువను గుంజుతారని మార్క్స్ అన్నాడు. ఈ కొల్లగొట్టే క్రమంలో వాళ్ళకి నైతికంగా ఏ సంకోచమూ ఉండదు. అంతే గాక, కార్మికుల శారీరక శక్తికి ఉండే పరిమితులను సైతం పట్టించు కోకుండా పెట్టుబడిదారులు చాలా నిర్దయగా వ్యవహరిస్తున్నారు. మన కార్మికులు తమ ఉత్పాదక తను బాగా పెంచుకోవాలని, ప్రపంచంలోనే అతి తక్కువ ఉత్పాదకతతో మన కార్మికులు పని చేస్తున్నారని నారాయణమూర్తి అంటున్నది ప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నదానికి పూర్తి భిన్నంగా ఉంది. 2000-2013 మధ్య ఆసియన్ ప్రొడక్టివిటీ ఆర్గనైజేషన్(ఎపిఓ)లో సభ్య దేశాలుగా ఉన్న 20 దేశాలలో శ్రామిక ఉత్పాదకతలో అత్యంత ఎక్కువగా పెరుగుదలను చైనా కార్మికులు నమోదు చేశారు. వారి ఉత్పాదకత 9.0 శాతం చొప్పున పెరిగింది. ఆ తర్వాత మంగోలియా లో 5.5 శాతం, ఇండియాలో 5.2 శాతం, లావోస్‌లో 4.6 శాతం, వియత్నాంలో 4.4 శాతం, కాంబోడియాలో 4.5 శాతం, శ్రీలంకలో 4.1 శాతం, ఇండోనేషియాలో 3.5 శాతం చొప్పున శ్రామిక ఉత్పాదకత పెరిగింది. అంటే ఇండియా ఎపివో దేశాలలో ఉత్పాదకత విషయంలో మూడో స్థానంలో ఉంది.

ఇక వారానికి 70 గంటలపాటు పని చేస్తే దాని ప్రభావం వృత్తిపరంగా సామర్థ్యాన్ని ఎంత దెబ్బ తీస్తుందో, కార్మికుల ఆరోగ్యంపై ఎటువంటి దుష్ప్రభావం పడుతుందో, పనికి, కుటుంబ జీవితానికి మధ్య ఉండవలసిన సమతూకం ఎంత దెబ్బ తింటుందో ఆ విషయాలేమీ మన కార్పొరేట్ మీడియా పట్టించుకోనేలేదు. నయా ఉదారవాద మేధావులతోబాటు చాలామంది ఉదారవాదులు సైతం నారాయణమూర్తికి వంత పాడుతున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐఎల్‌వో ఆధ్వర్యంలో ఎన్విరాన్‌మెంట్ ఇంటర్నేషనల్ అనే సంస్థ తన అధ్యయనాన్ని ప్రచురించింది. దాని ప్రకారం పని గంటలను పొడిగించడం వలన 2000 -2016 సంవత్సరాల మధ్య గుండె పోటు, ఇతర గుండె సంబంధిత వ్యాధులబారిన పడ్డ కార్మికుల సంఖ్య 29 శాతం పెరిగింది. ఈ కాలంలో 7,45,000 మరణాలు పనిగంటల పొడిగింపు కారణంగా సంభవించాయి. 2016లో 3,98,000 మంది గుండెపోటు వలన, మరో 3,47,000 మంది గుండె సంబంధిత వ్యాధుల వలన మరణించారని, వారానికి కనీసం 55 గంటల మేరకు పని వేళలను పొడిగించిన కారణంగా ఈ మరణాలు సంభవించాయని ఆ నివేదిక తెలియజేసింది. పని గంటలను పొడిగించినందువలన వృత్తి సంబంధిత మరణాలు అదనంగా మరో మూడో వంతు మేరకు పెరుగుతాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

మరోవైపు ఎక్కువ గంటలపాటు పని చేసేవారి సంఖ్య ప్రపంచ జనాభాలో ఇప్పుడు 9 శాతం ఉంది. అంటే పని గంటల పెంపు కారణంగా రాబోయే కాలంలో మరణాలు ఇంకా పెరగనున్నాయి.

ఉత్పత్తిని పెంచడం మీద, అదనపు విలువను కార్మికులనుండి కొల్లగొట్టడం మీద ప్రధానంగా పెట్టుబడిదారీ వర్గం దృష్టి పెడుతుందని, దాని ఫలితంగా సహజంగా పెంపొందవలసిన మానవ శ్రమ స్వభావం దెబ్బ తింటుందని, కార్మికుల శక్తి సామర్థ్యాలు తొందరగా హరించుకుపోయి మానవ శ్రమశక్తే అంతరించిపోతుందని కార్ల్‌మార్క్స్ చెప్పినది ఎంత సత్యమో ప్రస్తుత అనుభవాలు రుజువు చేస్తున్నాయి.

అడ్డూ, ఆపూ లేకుండా పనిగంటలను ఇష్టం వచ్చినట్టు పెంచివేయడానికి మోడీ ప్రభుత్వం చట్టపరంగా ఉన్న అడ్డంకులన్నింటినీ తొలగించింది. బానిసత్వపు దశతో పోల్చదగ్గ పరిస్థితి ఇది. మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లలో పని గంటలమీద గరిష్ట పరిమితిని ఎక్కడా విధించలేదు. 8 గంటల పని దినం గురించిన ప్రస్తావన కూడా లేదు. ఆ యా ప్రభుత్వాల ఇష్టాలకు ఈ అంశాన్ని విడిచిపెట్టింది. ఐతే కార్మిక సంఘాలు పదే పదే అభ్యంతరాలను తెలియజేసిన అనంతరం చాలా అయిష్టంగా కొన్ని నిబంధనలను చేర్చింది. కాని వాటికి అనేక మినహా యింపులు చేయడానికి అవకాశాలు కూడా ఇచ్చింది.

ఫ్యాక్టరీ చట్టం ప్రకారం రోజులో పదిన్నర గంటల వ్యవధిలో ఎనిమిది గంటల పాటు పని చేయించుకునే అవకాశం యజమానులకు ఉంది. దానిని కాస్తా ఇప్పుడు 12 గంటలకు పెంచారు. ప్రతీ ఆదివారమూ శలవు ఉండాలనే నిబంధనను మోడీ ప్రభుత్వం తొలగించింది. వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించిన లేబర్ కోడ్ ఆ యా ప్రభుత్వాలు తమ కార్మికుల పని గంటలను ఎంతవరకైనా పొడిగించుకోవచ్చు నని అవకాశం ఇచ్చింది. మూడు నెలల కాలంలో 125 గంటలవరకూ ఓవర్‌టైమ్ చేయించుకోడానికి ముసాయిదా నిబంధనలు అవకాశం ఇస్తున్నాయి. ఆ తర్వాత చాలా రాష్ట్ర ప్రభుత్వాలు రోజుకు 12 గంటలవరకూ పని గంటలను పొడిగిస్తూ ఆదేశాలు ఇచ్చాయి. కార్మికులనుండి తీవ్రంగా ప్రతిఘటన వచ్చాక వెనక్కి తగ్గాయి. కర్ణాటకలో బిజెపి ప్రభుత్వం, తమిళనాడు ప్రభుత్వం ఇటువంటి ఆదేశాలు ఇచ్చాయి. ఐతే ఆ రాష్ట్రాలలో తీవ్ర వ్యతిరేకత ఎదురవడంతో మళ్ళీ వెనక్కి తగ్గాయి.

తమ హిందూత్వ-బడా కార్పొరేట్ కూటమి ఎజెండాకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మలచడం తమ పనిగా నారాయణమూర్తి వంటి వారు పెట్టుకున్నారు. సంపదను సృష్టించడంలో తమ శ్రమశక్తిని, తమ నైపుణ్యాలను, తమ శారీరక, మానసిక సామర్థ్యాలను ధారపోసే కార్మికుల పట్ల పెట్టుబడిదారులకు ఏమాత్రమూ గౌరవం ఉండదని, ఒక పని రోజులో కార్మికుడినుండి ఎంత శ్రమశక్తిని గరిష్టంగా పిండుకోవాలో దాని గురించి మాత్రమే పెట్టుబడిదారుడు పట్టించుకుంటాడని మార్క్స్ చెప్పాడు. ఆ క్రమంలో కార్మికుల ఆయువు తగ్గిపోయినా పెట్టుబడిదారుడికి ఏ ఖాతరూ లేదు.

పెట్టుబడికి, శ్రమకు నడుమ ప్రస్తుతం జరుగుతున్న సంఘర్షణ సారాంశం ఇదే.

/ వ్యాసకర్త సిఐటియు జాతీయ కార్యదర్శి /

(స్వేచ్ఛానుసరణ)

★



ఐఐటిఎఫ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర పెవిలియన్ వద్ద మంత్రి అమర్‌నాథ్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు

వేగంగా పారిశ్రామిక ప్రగతి

- ఐఐటిఎఫ్‌లో ఎపి పెవిలియన్‌ను ప్రారంభించిన మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో అత్యంత వేగంగా పారిశ్రామిక ప్రగతి నమోదవుతోందని పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. నవంబరు 14 నుంచి 27 వరకు న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో ట్రేడ్ ఫెయిర్ జరగనుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధమైన ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటిఎఫ్) లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఎపి పెవిలియన్‌లో ఏర్పాటుచేసిన లేపాక్షి, ఆప్కో, గిరిజన్ కార్పొరేషన్ (జిసిసి) మొదలగు అంగళ్లను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలను ఆకర్షించడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తోందని, సకల సౌకర్యాలు కల్పించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. పది నూతన ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతో సముద్ర తీర ప్రాంతాభివృద్ధి త్వరితగతిన సాధించేందుకు ప్రయత్నిస్తున్నా మన్నారు. 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లా తన ఉనికిని చాటుకుం టోందని వ్యాఖ్యానించారు. దేశ టెక్స్‌టైల్స్ ఎగుమతిలో 13 శాతం రాష్ట్రం నుంచి జరుగుతోంద ని అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ డిపార్ట్‌మెంటు ప్రిన్సిపల్ సెక్రెటరీ కె సునీత, ఎపి భవన్ అడిషనల్ రెసిడెంట్ కమిషనరు హిమాన్షు కౌశిక్, ఎపి పరిశ్రమలశాఖ డిప్యూటీ డైరెక్టరు మోపర్తి సుధాకర్, ఎపి పరిశ్రమలశాఖ టెక్నికల్ హెడ్ భాను సాయి ప్రతాప్ పాల్గొన్నారు.

క్రిడా స్థితిగతులపై క్రిసిల్ ఆరా !

ప్రజాశక్తి పత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రభుత్వాల పనితీరును విశ్లేషించి రేటింగ్స్ ఇచ్చే ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ తాజాగా రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (క్రిడా)పై దృష్టి సారిస్తోంది. ఈ సంస్థపై విశ్లేషణ చేసి రేటింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు వివరాలు సమర్పించాలని ఆర్థికశాఖ, క్రిడా, పట్టణాభివృద్ధి శాఖలను కోరింది. రాజధాని ప్రాంతంలో 2019 వరకు కొన్ని పనులు జరగ్గా, అ తర్వాత ఒక్క పనీ జరగలేదన్న విమర్శల నేపథ్యంలో క్రిసిల్ ..క్రిడా పనితీరుపై ఆరా తీయడం చర్చనీయాంశమవుతోంది. గతంలో తీసుకున్న రుణాల్లో కొన్నింటిని తిరిగి చెల్లించడం, చాలా వరకు వడ్డీల చెల్లింపులతోనే కాలం వెల్లబుచ్చుతూ పనులు ముందుకు సాగడం లేదని, కొత్త పనులేవీ జరగడం లేదని క్రిడా విమర్శలెదుర్కొంటోంది. దీనిపై ఆడిట్ నిర్వహణ కూడా ప్రతియేటా జరగడం లేదన్నది సమాచారం. ఈ నేపథ్యంలో క్రిసిల్ మొత్తంగా క్రిడాకు, దాని ఆధ్వర్యంలో జరుగుతున్న పనులకు, ఆ పనులకు వెచ్చిస్తున్న నిధులకు రేటింగ్ ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంలోనే త్వరలో ఆర్థికశాఖ, ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో భేటీ కావాలని కూడా నిర్ణయించినట్లు తెలిసింది.

రైతుకిచ్చేది రూ.30... మార్కెట్లో అమ్మేది రూ.70

ఉల్లి వ్యాపారుల మాయాజాలం!



ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

దక్షిణ భారతదేశంలోనే అత్యధికంగా ఉల్లిని పండించే కర్నూలు జిల్లా రైతులు మార్కెట్ మాయాజాలంలో విలవిలలాడుతున్నారు. దళారులు రైతుల నుంచి కిలో ఉల్లిని తక్కువ ధరకు కొనుగోలు చేసి రిటైల్ మార్కెట్లో అధిక ధరకు అమ్ముతున్నారు. వ్యాపారులు ఇటు రైతులను, అటు వినియోగదారులను దోచుకుంటున్నారు. ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 38,707 ఎకరాలు కాగా, గతేడాది 59,160 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 42,162 ఎకరాలకే సాగు పరిమితమైంది. సాగు తగ్గినా రైతులకు గిట్టుబాటు లభించడం లేదు. సాధారణంగా ఆగస్టు నుంచి ఉల్లి పంట మార్కెట్‌కు వస్తుంది. ఈ ఏడాది వర్షాలు సరిగ్గా పడకపోవడంతో సాగు ఆలస్యమైంది. సెప్టెంబర్ నుంచి పంట మార్కెట్‌కు వస్తోంది.

పంట ఆలస్యంగా రావడం, మార్కెట్‌కు వచ్చే పంట తగ్గడంతో కర్నూలు ఉల్లి మార్కెట్లో ధర కొంచెం మెరుగ్గానే పలుకుతోంది. రైతు దగ్గర వ్యాపారులు కిలో రూ.30లోపు కొంటున్నారు. రిటైల్ మార్కెట్లో రూ.70కు విక్రయిస్తున్నారు. ఉల్లి సీజన్లైన అక్టోబర్, నవంబర్‌లో గతంలో మార్కెట్‌కు రోజుకు దాదాపు ఆరు వేల క్వింటాళ్లు వచ్చేది. ప్రస్తుతం 2 వేల నుంచి 3 వేల క్వింటాళ్ల మధ్యే వస్తోంది. ప్రస్తుతం కనిష్టంగా రూ.1,201, గరిష్టంగా రూ.4,010, మధ్యస్థంగా రూ.3,231 ధర పలుకుతోంది. ఎక్కువమందికి క్వింటాలుకు రూ.3 వేలు చొప్పున ధర లభిస్తోంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో 220 మంది లైసెన్స్‌డ్ వ్యాపారులు ఉన్నారు. వారిలో 30 మంది ఉల్లి క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. వ్యాపారులు సిండికేటై తమకు ఎక్కువ ధర రానీయకుండా అడ్డుకుంటున్నారని ఉల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావం వల్ల ఈ ఏడాది మహారాష్ట్రలోనూ ఉల్లి దిగుబడులు తగ్గాయి.

గతేడాది సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్లో మొత్తం 2,22,815 క్వింటాళ్ల ఉల్లి కర్నూలు మార్కెట్‌కు రాగా, ఈ ఏడాది నవంబర్ 14 నాటికి 1,23,444 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఉల్లి ఉత్పత్తులు అంతో ఇంతో మార్కెట్‌కు వస్తున్న ఈ సీజన్‌లో రూ.70కుపైగా ధర పలుకుతుంటే, అన్ సీజన్ అయిన జనవరి తర్వాత కిలో రూ.100కుపైగా చేరుకునే ప్రమాదం ఉందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, తమకు అందుబాటు ధరకు ఉల్లిని అందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

వ్యాపారులే లాభపడుతున్నారు

ఈ ఏడాది ఆరు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. ఎకరాకు రూ.80 వేల చొప్పున మొత్తం రూ.4.80 లక్షలు ఖర్చయింది. 180 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాలుకు రూ.2,500 చొప్పున మాత్రమే ధర పలికింది. మొత్తం రూ.4.50 లక్షలే వచ్చింది. ఏటా రైతులు నష్టపోతున్నారు. వ్యాపారులు మాత్రమే లాభపడుతున్నారు.

-శంకర్‌రెడ్డి, కొండాపురం, సి.బెళగల్

ఉల్లి ధర కన్నీళ్లు తెప్పిస్తోంది

ఉల్లి ధర రోజురోజుకూ పెరుగుతూ కన్నీళ్లు తెప్పిస్తోంది. పది రోజుల క్రితం కిలో రూ.50 ఉంటే, ఇప్పుడు రూ.70 అయింది. వీటితోపాటు మిగతా కూరగాయల ధరలూ పెరిగిపోయాయి. ధరలు అదుపులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-పద్మావతి, గృహిణి, ఆదోని

మధురమలై అడవులలో తిష్ట వేసిన ఏనుగులు

ప్రజాశక్తి- సోమల

చిత్తూరు జిల్లా సోమల మండలంలోని మధురమలై అడవులలో ఐదు ఏనుగుల గుంపు తిష్టవేసి అటవీ సమీప ప్రాంత పంట పొలాలపై రాత్రి వేళల్లో సంచరిస్తూ రైతుల పంటలకు నష్టాన్ని కలిగిస్తున్నాయి. సోమవారం రాత్రి వంగసానివారిపల్లి, రాంపల్లి గ్రామాల సమీపంలోని వరిపంట పై నడుచుకుంటూ వెళ్లి సమీపంలోని మధురమలై అడవులలో ఉన్నట్లు రైతులు గుర్తించారు. విషయం తెలుసుకుని అప్రమత్తమైన అటవీ అధికారులు ఏనుగుల గుంపు గ్రామాల వైపు, పంట పొలాల వైపు రాకుండా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. రాత్రి వేళల్లో రైతులు పంట పొలాల వద్దకు వెళ్లవద్దని, ఏనుగుల సంచారం కారణంగా రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

తల్లడిల్లిన గుండెలు

- గంట వ్యవధిలో తల్లీ కొడుకు మృతి
- నరసాపురంలో విషాదఛాయలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్ (పశ్చిమగోదావరి)

గంట వ్యవధిలో తల్లీ కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపడమే కాకుండా నరసాపురం వాసులను కలచివేసింది. పట్టణంలోని స్టీమర్ రోడ్డులో ఫెర్రీ రేవు వద్ద కిరాణా వ్యాపారి ముత్తయ్య భార్య కారుమూరి అలివేలు మంగ (68), కొడుకు లక్ష్మణ్‌కుమార్ (45) కుటుంబాలు కలిసే ఉంటున్నాయి. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో లక్ష్మణ్ తన పిల్లలను స్కూల్ బస్సు ఎక్కించి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో టిఫిన్ చేస్తున్న మంగ తనకు వికారంగా ఉందంటూ కుప్పకూలింది. దీంతో తల్లడిల్లిన లక్ష్మణ్ అమ్మా.. అమ్మా అంటూ పెద్దగా కేకలు వేసి గుండెపోటుకు గురయ్యాడు. గత ఫిబ్రవరిలోనే లక్ష్మణకుమార్ రెండు స్టంట్లు వేయించుకున్నాడు. వారిని కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా తల్లీ కొడుకు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. తల్లీ కొడుకుల మృతి వార్త పట్టణవాసులను కలిచివేసింది. కిరాణా వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిరాశాజనకంగా టిడిపి, జనసేన మినీ మేనిఫెస్టో

- మాజీ మంత్రి హరిరామజోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

జనసేన, టిడిపి సంయుక్తంగా ప్రకటించిన మినీ మేనిఫెస్టో జనరంజకంగా, ఆకర్షణీయంగా లేదని మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య అన్నారు. రాష్ట్రంలో ఐదు కోట్ల జనాభా ఆకాంక్షల మేరకు, వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ధీటుగా మినీమేనిఫెస్టో లేదని వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కనీసం నిరుపేదలకు కడుపు నిండా తిండి అందించే లక్ష్యం కానరాలేదన్నారు. కూరగాయలు, పప్పు దినుసులు వంటి నిత్యావసర వస్తువుల సేకరణ వంటి నిర్దిష్ట ప్రతిపాదనలు మేనిఫెస్టోలో లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని చెప్పారు. కొందరి సంక్షేమానికే పరిమితమై ప్రకటించిన ఈ మినీ మేనిఫెస్టో తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. కనీసం నాలుగు కోట్ల జనాభా సంతృప్తి చెందేలా ఆకర్షణీయంగా మేనిఫెస్టో తీర్చిదిద్దాలని కోరారు.

మినరల్ మాయ.!!

- అనుమతులు లేకున్నా ప్యాకెట్ల తయారీ
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రస్తుత పరిస్థితుల్లో శుద్ధి నీటి వినియోగం ప్రజలకు నిత్యావసరమైంది. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కువ మంది నేడు మినరల్ వాటర్‌నే తాగుతున్నారు. ప్రజల అవసరాన్ని ఆసరాగా తీసుకుంటున్న కొందరు వ్యాపారులు మినరల్ పేరుతో జనరల్ నీటిలో రసాయనాలు కలిపి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల ఆరోగ్యం కంటే వారి లాభాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నీటిని నామమాత్రంగా శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. పైగా ఒక్కో వాటర్ క్యాన్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. హిందూపురం పరిసర ప్రాంతాల్లో ఎనిమిదికిపైగా మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. వీళ్లంతా నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి వాటిని నిర్వహిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) అనుమతి తప్పనిసరిగా ఉండాలి. తొలుత పంచాయతీ లేదా మున్సిపాల్టీ నుంచి అనుమతులు తీసుకోవాలి. అనంతరం ప్లాంట్లో నీటిని మైక్రోబయాలజీ, కెమిస్ట్ నిపుణులు పరిశీలించాక అక్కడి నీరు శుద్ధజలమే అని వారు ధ్రువీకరించాలి. ఆ తర్వాతే ప్రజలకు సరఫరా చేయడానికి వారికి అనుమతి ఇస్తారు. మరోవైపు ప్లాంట్ నిర్వహణలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. పిహెచ్‌స్థాయి పదికి తగ్గకుండా చూడాలి. ప్రతిరోజూ నీటిని సరఫరా చేసిన క్యాన్‌లను పోటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రంచేయాలి. నీటిలో లవణ ఖనిజాలు వంటి మినరల్స్ ఎంతశాతం ఉన్నాయో చూసుకున్నాకే ఆ నీటిని విక్రయించాలి. ఈ నిబంధనలను కనీస ప్రమాణాలను పాటించడం లేదు. అన్ని నిబంధనలు పాటించిన వారు మాత్రమే నీళ్ల ప్యాకెట్లను తయారు చేసి విక్రయించాల్సి ఉంది. ఎటువంటి అనుమతులు లేకున్నా యథేచ్ఛగా ప్యాకెట్లను తయారు చేసి వాటిని మార్కెట్లో విక్రయిస్తున్నారు.

ఈ ప్యాకెట్లపై నీళ్లు ఎప్పుడు తయారు చేశారు.. ఎన్ని రోజులు కాల వ్యవధి.. అన్నది తప్పనిసరిగా ఉండాలి. ఈ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ప్యాకెట్లలో నీటిని నింపి వాటికి వివిధ రకాల పేర్లు పెట్టి సరఫరా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వస్తున్న ప్రజలు నీళ్ల ప్యాకెట్లను తాగి అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి వాటర్‌ప్లాంట్‌ల ద్వారా నాణ్యమైన నీరు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుడ్‌ఇన్స్‌పెక్టర్ జిల్లా కేంద్రానికే పరిమితం..!

ఎప్పటికప్పుడు పురపాలక సంఘాలతో పాటు మండల, గ్రామీణ ప్రాంతాల్లో ఆహార పదార్థాలపై తనిఖీలు చేసి నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్ ఇన్స్‌పెక్టర్ జిల్లా కేంద్రానికే పరిమితమయ్యారు. ప్రత్యేకంగా పెనుకొండ డివిజన్‌కు ఫుడ్‌ఇన్స్‌పెక్టర్ ఉండాలి. ప్రతిరోజూ డివిజన్ వ్యాప్తంగా తనిఖీలు చేయాల్సి ఉన్నప్పటికి తనిఖీలు చేయడం లేదు. దీంతో వ్యాపారులు తమపై ఎవరూ చర్యలు తీసుకోరు అన్న ధీమాతో యథేచ్ఛగా కల్తీ నీళ్ల వ్యాపారం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న పురపాకల సంఘం కమిషనర్, తహశీల్దార్లు మాత్రం నిబంధనలు అతిక్రమించి వాటర్ ప్లాంట్‌లను నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత కలకలం

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమలలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత సంచరిస్తున్నట్టు యాత్రికులు గుర్తించారు. వేగంగా రోడ్డు దాటుతున్న చిరుత పులిని చూసినట్టు పులివెందులకు చెందిన కొంతమంది యాత్రికులు చెప్పారు. దీనిపై వారు టిటిడి అధికారులకు కూడా సమాచారం అందించారు. దీంతో కాలినడకన వెళ్లే యాత్రికులను టిటిడి అధికారులు గుంపులు గుంపులుగా పంపిస్తున్నారు. చిరుత సంచారంతో శ్రీ వారి యాత్రికులు భయాందోళన చెందుతున్నారు. కొన్ని రోజుల కిందట చిరుతల సంచారం ఎక్కువగా ఉండటంతో వాటిని ఫారెస్ట్ అధికారులు బంధించి వేరో చోట విడిచిపెట్టారు. ఇప్పుడు మరో చిరుత కనిపించడంతో యాత్రికులు ఆందోళన చెందుతున్నారు.

సహకార బ్యాంకు సేవలు విస్తృతం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలను విస్తృతం చేసి రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. నెల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆవరణంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సహకార రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. వారం రోజులపాటు నిర్వహించే సహకార వారోత్సవాల్లో సహకార బ్యాంకుల సేవలను విస్తతంగా ప్రచారం చేయాలని సూచించారు. సహకార బ్యాంకులకు పూర్వ వైభవం తీసుకొచ్చిన నేత దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి అయితే, రూ.195 కోట్లతో షేర్ క్యాపిటల్ కేటాయించి సహకార రంగానికి చేయూతనిచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకును లాభాలబాట పట్టించిన చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ, పాలకమండలి సభ్యులు, అధికారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఇంటింటికి సహకారం కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు.

ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుల గణన

మంత్రి చెల్లుబోయిన వేణు

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలో బుధవారం నుంచి సమగ్ర కుల గణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 15 నుంచి చేపట్టే వివరాలను వివరించారు. ఏప్రిల్ 11న జ్యోతీభాపూలే జయంతి సందర్భంగా 139 బిసి కులలాతో పాటు, ఎస్‌సి, ఎస్‌టి, మైనాటీ వర్గాలు, ఉన్నత వర్గాలలో పేదరికంలో మగ్గుతున్న కులాలను గుర్తించి వారి సంక్షేమం, అభ్యున్నతి ప్రణాళికల రూపకల్పన చేపట్టేందుకు రాష్ట్రంలో సమగ్ర కుల గణన కార్యక్రమ నిర్వహణకు సిఎం సంకల్పించారన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 15 నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో తొలుత 5 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పైలెట్ ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని చేపట్టి, నిర్వహణ, విధాన పరమైన అంశాలను క్రోడీకరించి రాష్ట్రమంతటా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని తెలిపారు. జెసిలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ఈ నెల 15, 16 తేదీలలో అన్ని జిల్లా కేంద్రాల్లో అన్ని కులాలకు చెందిన పెద్దలు, మేధావులు, కుల సంఘాల ప్రతినిధులు సంఘాల నేతలు, ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 చోట్ల ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈ నెల 17న రాజమహేంద్రవరం, కర్నూలులో, 20న విశాఖపట్నం, విజయవాడలో, 24న తిరుపతిలోను ఈ సదస్సులు జరుగతాయని తెలిపారు. ఈ సమగ్ర కుల గణన కార్యక్రమంలో అన్ని కులాల, వర్గాల ప్రజలు చైతన్యవంతంగా పాల్గొనాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేష్ కుమార్

అక్రమ కేసులపై నిజనిర్ధారణ చేయండి

- ఐపిఎస్‌లు, జడ్జిలతో కమిటీలు వేయాలి
- మాజీ ఎన్నికల కమిషనర్ రమేష్ కుమార్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో ప్రతిపక్షాలపై నమోదవుతున్న అక్రమ కేసులను పరిశీలించేందుకు విశ్రాంత జడ్జిలతో కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. గుంటూరులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. స్థానికంగా ఉండడం లేదని కొంత మంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించడం సరికాదన్నారు. ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు, ఇంటి పన్ను, ఇతర గుర్తింపు కార్డులు చూపి ఓటరుగా కొనసాగవచ్చని తెలిపారు. స్థానికంగా నివాసం ఉండడంలేదని తనకు మూడేళ్ల ఓటు ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. ప్రజా చైతన్య కార్యక్రమంలో అధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి పాల్గొనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 7 జారీ చేసిందని, ఆ జిఒ ప్రకారం ఒక రాజకీయ పార్టీ నిర్వహించే ప్రచారం కార్యక్రమంలో కలెక్టర్ స్థాయి నుండి కింది స్థాయి సిబ్బంది వరకు భాగస్వాములు కావలసి ఉంటుందన్నారు. రాజకీయ ప్రయోజనాలతో కూడిన అధికార పార్టీ కార్యక్రమాల కోసం అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. అధికార యంత్రాంగాన్ని, వనరులను వినియోగించడం అంటే రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడమేనని అన్నారు. సమావేశంలో జంధ్యాల శంకర్, వి.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రమేదీ?

- సెప్టెంబర్‌లోనే మొదటి పికింగ్
- ప్రయివేటు వ్యాపారులకే అమ్మకాలు
- చోద్యం చూస్తున్న మార్కెటింగ్ శాఖ

ప్రజాశక్తి- సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

సాలూరు నియోజకవర్గం పరిధిలో పత్తి కొనుగోలు కేంద్రం ఇంతవరకు ప్రారంభం కాకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెప్టెంబరులో పత్తి మొదటి సారి ఏరివేత ప్రారంభమవుతుంది. అంటే అప్పటి నుంచే రైతులు అమ్మకానికి సిద్ధంగా ఉంటారని తెలిసినా ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదు. అక్టోబరు, నవంబర్ నెలల్లో రెండోసారి ఏరివేత చేయడం కూడా జరిగింది. అయినా జిల్లా అధికారులు పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై దృష్టి సారించలేదు. ప్రతి ఏటా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం నామమాత్రంగా ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. గడచిన మూడేళ్లుగా ఇక్కడ ఆలస్యంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం, ఈలోగా రైతులు వ్యాపారులకు విక్రయించేయడం జరుగుతోంది. ప్రయివేటు వ్యాపారులు క్వింటాకు రూ.6వేల నుంచి రూ.6500 వరకు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.7020 అంటే రైతులు క్వింటాలుకు రూ.500 నుంచి వెయ్యి రూపాయలు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. గత కొన్నేళ్లుగా ఇదే తంతు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. నియోజకవర్గ పరిధిలో పాచిపెంట, సాలూరు, మక్కువ మండలాల్లో అధిక విస్తీర్ణంలో పత్తి సాగవుతోంది. పాచిపెంట మండలంలో 2600ఎకరాలు, సాలూరు మండలంలో 1200 ఎకరాలు, మక్కువ మండలంలో 600ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. కాటన్ కార్పొరేషన్ ఏటా ఇక్కడ ఎఎంసి యార్డ్‌లో కొనుగోలు ఏర్పాటు చేసినట్లు బోర్డు పెట్టి వదిలేస్తుంది. ఈ క్రాప్ నమోదు, తేమ శాతం వంటి నిబంధనలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మకానికి గుదిబండగా వుంటాయనే కారణంతో రైతులు ప్రయివేటు వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తారనే నమ్మకం లేకపోవడంతో రైతులు ఏదో ఒక ధరకు సర్దుకుని తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభంలోనే సిసిఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే ఇక్కడ సీజన్ చివరి వరకు ప్రారంభించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



దళారుల వద్దకు పత్తిని తరలిస్తున్న రైతులు

జిన్నింగ్ మిల్లుతో సిసిఐ అధికారుల కుమ్మక్కు

విజయనగరం జిల్లా రామభద్రపరం మండలంలోని ముచ్చర్లవలసలో పత్తి జిన్నింగ్ మిల్లు గత కొంతకాలంగా నడుస్తోంది. ఈ ప్రాంతంలో పండించిన పంట అంతా వ్యాపారుల ద్వారా ఈ మిల్లుకే చేరుతోంది. సిసిఐ, మార్కెటింగ్‌శాఖ అధికారులు జిన్నింగ్ మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కు కారణంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఆలస్యంగా ప్రారంభిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. రైతుల నెత్తిన శఠగోపం పెడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతుకు అందని ద్రాక్షలా తయారైంది. క్వింటాకు రైతులు వెయ్యి రూపాయల వరకు నష్టపోతున్నారు. దళారీల వలలో రైతులు విలవిలాడుతున్నారు.

సాంకేతిక రంగం అభివృద్ధితోనే దేశాభివృద్ధి

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

సాంకేతిక రంగం అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్దన అన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెఎన్‌టియు విశ్వ విద్యాలయంలోని పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ సాంకేతిక రంగం అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని భావించిన అప్పటి ప్రధాని నెహ్రూ అప్పట్లోనే సాంకేతికతకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కావున ప్రతి ఒక్కరూ పరిశోధనాత్మకంగా ఆలోచించినప్పుడే నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు కేశవరెడ్డి, శోభాబిందు, పి.సుజాత, ఎన్.విశాలి, వి.బి.చిత్ర, ఎ.సురేష్‌బాబు, బి.దుర్గాప్రసాద్, జి.వి.సుబ్బారెడ్డి, పద్మ సువర్ణ, చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఆచార్యులు వి.శంకర్, వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, టి.బాలనరసయ్య, టి.నారాయణరెడ్డి, ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, డి.విష్ణువర్ధన్, ఎం.రామ శేఖరరెడ్డి, కె.ఎఫ్.భారతి, కళ్యాణి రాధా, దిలీప్‌కుమార్, అజిత, శివలింగారావు, డిప్యూటి రిజిస్ట్రార్ ఎన్.మధుసూదనరెడ్డి, దుర్గాప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లేరు కాంటూరు పరిధి పెంచితే ఉపాధికి దెబ్బ

- పలువురు వక్తలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రస్తుత కొల్లేరు అభయారణ్యం పరిధి ఐదో కాంటూరు కన్నా పెంచితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గి నిరుద్యోగం పెరుగుతుందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కొల్లేరు అభయారణ్య ప్రతిపాదిత సున్నిత పర్యావరణ అవగాహన సమావేశంలో పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎన్నికల హామీలో కాంటూరు మూడుకు కొల్లేరు పరిధిని తగ్గిస్తామని హామీ ఇచ్చారని దాన్ని అమలు చేయకపోగా కాంటూరు ఐదు దాటి పరిధి పెంచితే ఎంతో మంది రైతులు, వ్యవయసాయ కూలీలు వలసలు వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆయా ప్రాంతాల వివిధ సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలిపారు. కైకరం పంచాయతీ పరిధి రామన్నగూడెం కాంటూరు ఐదు పరిధిలో ఉండగా తాజాగా ప్రభుత్వం ఈ పరిధిని పెంచితే రామన్నగూడెం మొత్తం కొల్లేరు అభయారణ్యం పరిధికి వచ్చి వ్యవసాయం, చేపల చెరువులన్నీ నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లాపురం గ్రామానికి కొల్లేరు అభయారణ్యం రేడియేషన్ పరిధిలోకి వస్తుండడంతో ఆ గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కొల్లేరు అభయారణ్యం ప్రతిపాదిత సున్నిత పర్యావరణ అంశంపై తహశీల్దారు ఎవి.రమణరావు వివరించారు. ఏమైనా అభ్యంతరాలు, ప్రతిపాదనలుంటే లిఖిత పూర్వకంగా ఇస్తే వాటిని కమిటీ ఛైర్మన్‌కు, కలెక్టర్‌కు పంపుతామన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎన్.ప్రేమాన్విత, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎన్.పాపారత్నం, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, డిటి బి.దుర్గాప్రసాద్, వైసిపి జిల్లా కార్యదర్శి పుప్పాల గోపీ, ఎంపిటిసి పి.వెంకన్న పాల్గొన్నారు.

వైవీయూ పరిధిలో ఆనర్స్ కోర్సు : విసి

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌తో పాటు అనుబంధ కళాశాలలో నాలుగేళ్ల ఆనర్స్ కోర్సును నాలుగో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు విసి ఆచార్య చింతా సుధాకర్ వెల్లడించారు. మంగళవారం ఆయన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డితో కలిసి జాతీయ విద్యా విధానం -2020 అమలులో భాగంగా నాలుగేళ్ల డిగ్రీని అందుబాటులోకి తెస్తూ ఆ వివరాలను వెల్లడించారు. డిగ్రీ పూర్తయిన, ఏపీ పీజీ సెట్ రాసి సీటు పొందని, ఇన్‌స్టంట్‌లో ఉత్తీర్ణులైన వారు వైవీయూతో పాటు పాటు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 20 డిగ్రీ కళాశాలలో ఆనర్స్ కోర్సు నాలుగో ఏడాదిలో చేరేందుకు అద్భుత అవకాశం అన్నారు. . గ్రామీణ విద్యార్థులకు విశ్వవిద్యాలయ విద్యను అందించడమే లక్ష్యంగా వైవీయూలో 19 కోర్సులలో ప్రవేశాలు ఈ విద్యా సంవత్సరం కల్పిస్తు న్నామ న్నారు. నాలుగేళ్ల ఆన్సర్ నాలుగో ఏడాదిలో చేరడం ద్వారా తర్వా త పీజీ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందవచ్చున్నారు. ఎలాంటి పరీక్ష లేకుండా విశ్వ విద్యాలయంలో చదివే అద్భుత అవకాశం ఈ కోర్సుల ద్వారా లభిస్తోందన్నారు. దరఖాస్తులను www.yvu.edu.inలో డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిచేసి అన్ని రకాల అర్హత పత్రాలను జతపరిచి ఈనెల 25లోపు విశ్వవిద్యాలయంలోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

అసమానతలు తొలగించడానికి కృషి

మాజీ ఐఎఎస్ అధికారి విజయ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో అసమానతలు తొలగిపోవాలంటే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలంతా ఏకం కావాలని మాజీ ఐఎఎస్ అధికారి జి.ఎస్.ఆర్.కె.ఆర్.విజయ్‌కుమార్ కోరారు. తిరుపతి జిల్లా తడ నుంచి చేపట్టిన ఐక్యతా విజయపథం పాదయాత్ర మంగళవారం సాయంత్రం గుంటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఎసి కళాశాలలో 'పేదజన విముక్తి' సదస్సు నిర్వహించారు. సభకు మాల మహానాడు నాయకులు మల్లెల వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో విజయ్‌కుమార్ మాట్లాడుతూ..తడ నుంచి కాకినాడ జిల్లా తుని వరకు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. దేశంలో అసమానతలు కొనసాగడం వల్లే మానవాభివృద్ధి సూచికలో ప్రపంచంలోని 150 దేశాల్లో భారత్ 138 స్థానంలో ఉందన్నారు. ఇప్పటికి వివిధ తరగతుల పట్ల వివక్ష, కుట్ర, దౌర్జన్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో జరిగిన మారణ హోమం ఇందుకు నిదర్శమని తెలిపారు. మానవత్వం లేకుండా కొంతమంది క్రైస్తవులపై దాడులు చేస్తున్నా ఎవ్వరూ అడ్డుకోలేదన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధికి విద్య మాత్రమే ఉపయోగపడుతుందని తెలిపారు. సామాన్య ప్రజలకు విద్యను దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యా వ్యవస్థను కాపాడేందుకు తాను కృషి చేసినట్టు తెలిపారు. ఈ సభలో వివిధ సంఘాల నాయకులు కేశన శంకరరావు, అడపా మోహన్, అన్నవరపునాగ మల్లేశ్వరరావు, విజయకుమారి, పి.విద్యాసాగర్, బెంజిమన్, జయసుధ, గోపి తదితరులు పాల్గొన్నారు.



'నా సామి రంగ' పాట సిద్ధమవుతోంది

నాగార్జున నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'నా సామి రంగ'. విజయ్ బిన్ని దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో ప్రస్తుతం మ్యూజిక్ సెట్టింగ్స్ జరుగుతున్నాయి. ఆర్ఆర్ఆర్ తరువాత ఎంఎం కీరవాణి, చంద్రబోస్ ఈ సినిమా కోసం మళ్లీ కలిసి పనిచేయబోతున్నారు. ఈ ఇద్దరి కాంబోలో ఓ పాట రెడీ అవుతుందని సమాచారం. ఈ విషయాన్ని తెలియజేస్తూ నాగార్జున, కీరవాణితో కలిసి దిగిన ఫొటోను చంద్రబోస్ సోషల్‌మీడియాలో షేర్ చేశారు. ఈ చిత్రాన్ని 2024 సంక్రాంతి కానుకగా విడుదల చేస్తున్నారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో వస్తున్న ఈ చిత్రానికి ప్రసన్న కుమార్ బెజవాడ కథ అందిస్తున్నారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని ఈ సినిమాతో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు.

'చారి 111' ఫస్ట్ లుక్



వెన్నెల కిశోర్ కథానాయకుడిగా నటిస్తున్న సినిమా 'చారి 111'. బర్కత్ స్టూడియోస్ పతాకంపై అదితి సోనీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టీజీ కీర్తి కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సంయుక్తా విశ్వనాథన్ కథానాయిక. మురళీ శర్మ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రం నుండి మంగళవారం సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. 'ఇదొక స్పై యాక్షన్ కామెడీ సినిమా. సిల్లీ మిస్టేక్స్ చేసే కన్ ఫ్యూజ్డ్ స్పై 'వెన్నెల' కిశోర్ ఓ పెద్ద కేసును ఎలా సాల్వ్ చేశాడనేది సినిమాలో చూడాలి. గూఢచారి సంస్థ హెడ్‌గా కథలో కీలకమైన పాత్రలో మురళీ శర్మ కనిపిస్తారు' అని దర్శకుడు ఈ సందర్భంగా మాట్లాడారు. 'స్పై జానర్ సినిమాల్లో 'చారి 111' కొత్తగా ఉంటుంది. 'వెన్నెల' కిశోర్ గారి నటన, టీజీ కీర్తి కుమార్ దర్శకత్వం సినిమాకు హైలైట్ అవుతాయి. చిత్రీకరణ పూర్తి అయ్యింది. ఈ రోజు విడుదల చేసిన ఫస్ట్ లుక్ ఫెంటాస్టిక్ రెస్పాన్స్ అందుకుంటోంది. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడిస్తాం" అని నిర్మాత చెప్పారు.

ఓటీటీలోకి '800'

శ్రీలంక లెజెండరీ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన మూవీ '800'. ఈ సినిమాకి ఎంఎస్ శ్రీపతి దర్శకత్వం వహించారు. షెహన్ కరుణ తిలకతో కలిసి ఆయన ఈ మూవీ స్క్రిప్ట్ ను రాశారు. శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణ ప్రసాద్ తెలుగు, హిందీ మరియు తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా అక్టోబరు 6న ఈ సినిమాను విడుదల చేశారు. తాజాగా ఇప్పుడు ఓటీటీ విడుదలకు సిద్ధం అయ్యింది. 'జియో సినిమా' ఓటీటీ ప్లాట్ ఫామ్ ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. డిసెంబర్ 2వ తేదీ నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ మొదలు కానుందని మంగళవారం జియో సంస్థ ట్విట్టర్‌లో పేర్కొంది. తెలుగుతో పాటు హిందీ, తమిళ, మలయాళ, కన్నడ సింహళ భాషల్లో డిజిటల్ రిలీజ్ కానుంది. ఈ సినిమాలో మురళీధరన్ పాత్రలో మధుర్ మిట్టల్ నటించగా మురళీధరన్ భార్య మది మలర్ పాత్రలో మహిమా నంబియార్ నటించారు. శరత్ లోహితస్య ముఖ్య పాత్ర చేశారు.



'నాన్న నువ్ నా ప్రాణం'



సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణబీర్ కపూర్ నటిస్తోన్న సినిమా 'యానిమల్'. రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తోన్న ఈ చిత్రంలో అనిల్ కపూర్, బాబీ డియోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మూడో పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'నాన్న నువ్ నా ప్రాణం' అంటూ సాగే ఈ పాటలో రణబీర్ కపూర్, అతని తండ్రి అనిల్ కపూర్ మధ్య ఉండే బంధాన్ని మనసుకు హత్తుకునేలా చూపించారు. ఐదు భాషల్లో ఈ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా.. హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్ అందించారు. సోను నిగమ్ ఆలపించారు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ సినిమా డిసెంబర్ 1న విడుదల అవుతుంది.

'రెబల్' టీజర్ విడుదల

స్టూడియో గ్రీన్ పతాకంపై జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా 'రెబల్' చిత్రం తెరకెక్కుతోందన్నది తెలిసిందే. కే.జి.జ్ఞానవేల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి టీజర్ విడుదలైంది. ఈ చిత్రంలో మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. కరుణాస్, సుబ్రమణి శివ, షాలు రహీం తదితరులు ఇతర పాత్రలు చేస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తూనే సంగీతం కూడా అందిస్తున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాల్లో ఉంది. హీరో సూర్య ఈ చిత్ర టీజర్ రిలీజ్ చేశారు. పోలీస్ స్టేషన్ బయట ఓ ఫైట్ సీన్‌ను ఈ టీజర్‌లో చూపించారు. త్వరలో విడుదల తేదీ ప్రకటించనున్నారు.



తొలిరౌండ్‌లోనే ఓడిన చిరాగ్-సాత్విక్

జపాన్ మాస్టర్స్ సూపర్-500 టోర్నీ



టోక్యో: జపాన్ మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో టాప్‌సీడ్ భారత్‌కు చెందిన చిరాగ్-సాత్విక్ తొలిరౌండ్‌లోనే ఓటమిపాలయ్యారు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో చిరాగ్-సాత్విక్ 21-16, 18-21, 16-21తో చైనీస్ తైపీకి చెందిన లూచింగ్-యంగ్-పోపై పోరాడిఓడారు. ఈ మ్యాచ్ గంటా 3నిమిషాలసేపు సాగింది. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించి పురుషుల డబుల్స్‌లో టాప్ ర్యాంక్‌కు చేరిన భారతజంట ఆ తర్వాత జరిగిన టోర్నీల్లో ఆశించినస్థాయిలో రాణించలేకపోతోంది. ఈ ఓటమికి ముందు భార త జంట తైపీ జంటపై 3-0 ఆధిక్యతలో ఉండ గా.. తొలిసారి చైనీస్ తైపీ జంట చేతిలో ఓడారు.

భారత జూనియర్ హాకీజట్టు కెప్టెన్‌గా ఉత్తమ్ సింగ్

భువనేశ్వర్: భారత పురుషుల జూనియర్స్ హాకీ జట్టు కెప్టెన్‌గా ఉత్తమ్‌సింగ్ ఎంపికయ్యాడు. మలేషియా వేదికగా జరిగే జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో భారతజట్టు తరఫున ఆడే మొత్తం 20మందితో కూడిన హాకీ బృందాన్ని హాకీ ఇండియా(హెచ్‌ఐ) మంగళవారం ప్రకటించింది. డిసెంబర్ 5 నుంచి 16వరకు కౌలలంపూర్‌లో ఈ పోటీలు జరుగనున్నాయి. ఆసియా చాంపియన్‌గా నిలిచిన భారత జట్టు గ్రూప్-సిలో ఉండగా... ఇదే గ్రూప్‌లో కెనడా, దక్షిణ కొరియా, స్పెయిన్ జట్లు ఉన్నాయి. భారతజట్టు డిసెంబర్ 5న జరిగే కొరియా, 7న స్పెయిన్, 9న కెనడాను ఢీకొననుంది.

సర్పంచులకు దక్కని గౌరవం

- జిల్లా వ్యాప్తంగా 6 నెలలుగా బకాయిలు
- మనోవేదనతోనే కాలం గడుపుతున్న సర్పంచ్‌లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం పాలనలో తమకు 'గౌరవం' దూరమైందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమతో పోల్చితే వాలంటీర్ల పరిస్థితే కొంత మేలని వాపోతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో వాలంటీర్లకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తున్న విషయం విధితమే. జిల్లావ్యాప్తంగా 366 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 6 నెలలుగా గౌరవ వేతన బకాయిలు ఉన్నట్లు సర్పంచ్‌లు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక్కొక్క సర్పంచ్‌కు రూ.18,000 చొప్పున అక్షరాలా రూ.65.88 లక్షలు బకాయిలు ఉన్నట్లు సమాచారం. 90 శాతం గ్రామ పంచాయతీల్లో వైసిపి మద్దతుదారులే సర్పంచ్‌లుగా కొనసాగుతున్నారు. జిల్లాలో సర్పంచ్ ఎన్నికలు జరిగి 30 నెలలు కాగా ప్రారంభంలో నాలుగైదు నెలలకు మాత్రమే గౌరవ వేతనం ఇచ్చింది. ఇక రెండేళ్ల నుంచి గౌరవ వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ వస్తోంది. పల్లెల్లో పరపతి కోసం సర్పంచ్‌లుగా ఎన్నికై నాటి నుంచి స్థానికంగా ఏదో చేద్దామని కలలు కన్నారు. గ్రామ పంచాయతీల్లో ఉన్న నిధులు తాము అనుకున్న విధంగా ఖర్చు చేయవచ్చన్న ఉద్దేశంతో సొంత ఖర్చులతో పలు రకాల పనులు చేశారు. అలా పనులు చేస్తున్న క్రమంలోనే ప్రభుత్వం షాక్ ఇచ్చింది. పంచాయతీ అకౌంట్లలో ఉన్న నిధులను ప్రభుత్వం తమ అకౌంట్లలోకి జమ చేసుకోవటం ప్రారంభించింది. సర్పంచ్‌లుగా కొత్తగా వచ్చిన సమయం కదా అని మొదట్లో వదిలేశారు. రాను రాను కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను కూడా ప్రభుత్వమే వాడేసుకుని పంచాయతీ అకౌంట్లను జీరో చేయటం పరిపాటిగా మారింది. పనులకు బిల్లులు రాక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం(జీతం) కూడా ఇవ్వని దుస్థితి ఏర్పడింది. సర్పంచ్‌లకు ఏ నెలకానెల రూ.3 వేలు గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. గ్రామాల్లో నిరంతరం ప్రజలతో ఉండే సర్పంచ్‌లకు ఒక వైపు కనీస గౌరవం లేకుండా పోతుండగా ఇంకొక వైపు ప్రభుత్వం ఇవ్వాల్సిన గౌరవ వేతనం కూడా ఇవ్వడం లేదు. ప్రతి ఏటా రెండు సార్లు విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం సిఎఫ్‌ఎంఎస్ ఖాతా ద్వారా విద్యుత్ చార్జీలకు ఇతరాత్ర ఖర్చులకు దారి మళ్లిస్తోంది. మైనర్ పంచాయితీలలో అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణకు సైతం నిధులు లేక సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరస్థితుల్లో నెలల తరబడి గౌరవ వేతనాలు తీసుకోలేని పరిస్థితి నెలకుందని కొందరు వాపోతున్నారు. ఈ గౌరవ వేతనం కోసం సర్పంచ్‌ల సంఘం జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేకసార్లు ఉన్నతాధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోని పరిస్థితి వచ్చిందంటే సర్పంచ్‌ల మనోవేదన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

6 నెలలుగా గౌరవ వేతనాలు లేవు

రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులకు సక్రమంగా గౌరవ వేతనం విడుదల చేయటం లేదు. ఎన్నికలు జరిగిన నాటి నుంచి ప్రతి నెలా విడుదల చేసిన దాఖలాలు లేవు. 6 నెలలకోసారి వేతనాలు విడుదల చేస్తోంది. ప్రస్తుతం ఆరు నెలల బకాయిలు ఉన్నాయి. అక్షరాలా రూ.18,000 బకాయిలు ఉన్నాయి.

-చెక్కపల్లి మురళీకృష్ణ, సర్పంచ్, కడియపుసావరం, కడియం మండలం.


విటమిన్ సి లోపం.. అశ్రద్ధ వద్దు..

మంచి ఆరోగ్యానికి సరైన మోతాదులో పోషకాలు అవసరం. పోషకాల లోపం అనేక రోగాలకు అనువుగా మారుతుంది. శరీరానికి అవసరమైన అనేక పోషకాల్లో విటమిన్ సి చాలా ముఖ్యమైనది. ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుండి మన శరీరాన్ని రక్షిస్తుంది. ఇంకా, కణజాలం, అవయవాలను కలిపి ఉంచే కొల్లాజెన్ అనే ప్రోటీన్ ఉత్పత్తికి ఇది చాలా అవసరం. విటమిన్ సి లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను అశ్రద్ధ చేస్తే భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

అలసట/బలహీనత : తరచుగా చాలా అలసటగా, బలహీనంగా అనిపిస్తే, ఇది విటమిన్ సి లోపం వల్ల కావచ్చు. ఎందుకంటే విటమిన్ సి అనేది మన శరీరం శక్తిని ఉత్పత్తి చేయడానికి సహాయపడే ఒక పోషకం.

రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం : తరచుగా జలుబు, దగ్గు, ఇతర ఇన్ఫెక్షన్లకు గురవుతుంటే, అది కూడా విటమిన్ సి లోపం లక్షణమని గుర్తించాలి. శరీరంలో విటమిన్ సి లేనప్పుడు, ఇన్ఫెక్షన్‌తో పోరాడటానికి శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తి బలహీన పడుతుంది.

డ్రై స్కిన్ : శరీరానికి అవసరమైన ప్రొటీన్ అయిన కొల్లాజెన్ ఉత్పత్తికి ఇది చాలా అవసరం. ఈ ప్రొటీన్ ఆరోగ్యకరమైన చర్మానికి కారణమవుతుంది. అయితే విటమిన్ సి లోపం వల్ల శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గి, పొడి చర్మం సమస్యను పెంచుతుంది.



కీళ్ల నొప్పులు : విటమిన్ సి ఒక శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ. అయితే, ఈ లోపం ఉన్నప్పుడు, కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

పైన పేర్కొన్న లక్షణాలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించి సరైన చికిత్స పొందాలి. అదనంగా, రోజువారీ ఆహారంలో విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు, కూరగాయలను ఎక్కువగా ఉపయోగించాలి.

ఒబెరాయ్ గ్రూప్ చైర్మన్ ఇకలేరు



న్యూఢిల్లీ : ఒబెరాయ్ గ్రూప్ ఎమెరిటస్ చైర్మన్ పృథ్వీ రాజ్ సింగ్ ఒబెరాయ్ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయసు 94 ఏళ్లు. ఒబెరాయ్ మరణవార్తను సంస్థ అధికార ప్రతినిధి ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. 'సోమవారం ఉదయం ఎమెరిటస్ చైర్మన్ పిఆర్ఎస్ ఒబెరాయ్ శాంతియుతంగా కన్నుమూశారు. ఒబెరాయ్ నిష్క్రమణ భారత్, విదేశాల్లో ఒబెరాయ్ గ్రూప్‌కు తీవ్రమైన నష్టం'గా ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపింది. 1929 ఫిబ్రవరి 3న ఒబెరాయ్ జన్మించారు. ఇంగ్లండ్, స్విట్జర్లాండ్‌లో చదువుకున్నారు. ఆయన సారథ్యంలో ఒబెరాయ్ గ్రూప్ హోటళ్ల రంగంలో తనదైన ముద్ర వేసింది. 2008 జనవరిలో పద్మ విభూషణ్‌ను అందుకున్నారు.

అసఫక్ ఆలమ్‌కు ఉరిశిక్ష

- ఐదేళ్ల బాలికపై హత్యాచారం కేసులో తీర్పు

కొచ్చి : కేరళలోని అలువాలో ఐదేళ్ల బాలికపై అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేసిన కేసులో దోషి అసఫక్ ఆలమ్‌కు ఎర్నాకులంలోని ప్రత్యేక కోర్టు ఉరిశిక్ష విధించింది. మంగళవారం బాలల దినోత్సవం రోజున కోర్టు ఈ తీర్పు ఇచ్చింది. అపహరణ, హత్య, మైనర్‌పై అత్యాచారం వంటి 13 కేసుల్లో ఆలమ్‌ను గతంలోనే కోర్టు దోషిగా నిర్ధారించింది. పోక్సో చట్టం, ఐపిసి కింద నమోదైన కేసులో విచారణ కోసం మంగళవారం ఎర్నాకులం కోర్టుకు ఆలమ్‌ను హాజరుపర్చారు. ప్రత్యేక జడ్జి కె.సోమన్ మరణ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఐపిసి సెక్షన్ 302 ప్రకారం మరణశిక్ష విధిస్తున్నట్లు, ఉరి ద్వారా మరణ శిక్ష అమలు చేయబడుతుందని తీర్పులో వెల్లడించారు. ఈ ఏడాది జులై 28న బాలికను మిఠాయిలు ఆశచూపించి ఆలమ్ కిడ్నాప్ చేశాడ. తరువాత దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేశాడు. ఈ కేసు ప్రాసిక్యూషన్‌కు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. మోహన్‌రాజ్ నాయకత్వం వహించారు.

రాజ్‌భవన్ వద్ద పెట్రోల్ బాంబులు ఘటనపై ఎన్ఐఎ దర్యాప్తు

చెన్నై: చెన్నైలోని రాజ్‌భవన్ ఎదురుగా అక్టోబరు 25న పెట్రోల్ బాంబులు విసిరిన ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కేసు నమోదు చేసింది. పేలుడు పదార్థాల చట్టం కింద ఈ కేసు నమోదైందని పోలీసు వర్గాలు తెలిపాయి. కరుక్కా వినోద్ అనే వ్యక్తి రెండు పెట్రోల్ బాంబులను విసరడంతో పోలీసు బారికేడ్ ధ్వంసమైంది. వెంటనే ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో కూడా పలు కేసుల్లో ఆ వ్యక్తి నిందితుడుగా వున్నాడు. 2015 ఆగస్టు 12న తేనాంపేట్ పోలీసు స్టేషన్‌పై పెట్రోల్ బాంబులతో దాడి చేసిన ఘటనలో కూడా నిందితుడు. 2017 జులై 13న తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్యాలయంపై కూడా ఇలాగే దాడి చేశాడు. ఎన్ఐఎ కేసు నమోదు చేసినట్లు తమకు ఎలాంటి సమాచారం అందలేదని సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. ఇప్పటివరకు తాము చేసిన దర్యాప్తు, అందుబాటులో వున్న సాక్ష్యాధారాలను బట్టి కరుక్కా వినోద్ ఒక్కడికే ఈ కేసులో సంబంధముందని స్పష్టమైందని చెప్పారు. సంఘటనా ప్రాంతంలోని హెడ్ కానిస్టేబుల్ ఇచ్చిన సమాచారం ఆధారంగా గిండీ పోలీసులు కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసును తమకు అప్పగించాల్సిందిగా ఎన్ఐఎ కోరడంతో చెన్నై పోలీసులు కేసును బదిలీ చేశారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ కుమార స్వామి : కాంగ్రెస్

బెంగళూరు : కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, జెడిఎస్ నాయకులు కుమారస్వామి విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. బెంగళూరు జెపి నగర్‌లోని కుమారస్వామి నివాసానికి వీధిలో ఉన్న విద్యుత్ లైన్ నుంచి కరెంటును చౌర్యం చేస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు సోషల్ మీడియా ఖాతాలో ఇందుకు సంబంధించిన ఒక ఫోటోను కాంగ్రెస్ మంగళవారం పోస్ట్ చేసింది. కుమారస్వామిని ఉద్దేశించి 'మీరు ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నట్లయితే, గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకం ద్వారా నెలకు 200 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్‌ను అందజేస్తారు' అని వ్యాఖ్యనించింది. కాంగ్రెస్ ఆరోపణలపై కుమారస్వామి స్పందించారు. ప్రైవేట్ డెకరేటర్ ద్వారా లైటింగ్ పెట్టారని, విషయం తెలుసుకుని విద్యుత్ లైన్‌కు కనెక్షన్‌ను తొలగించామని కుమారస్వామి తెలిపారు. ఈ అంశంపై విద్యుత్ అధికారుల విచారణకు సిద్ధంగా ఉన్నానని, నోటీసు అందజేస్తే జరిమానా చెల్లిస్తానని కుమారస్వామి చెప్పారు.

కేజ్రీవాల్, ప్రియాంకకు ఇసి షోకాజ్ నోటీసులు





న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై అసత్య, తప్పుడు వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా, ఆప్ నాయకులు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మంగళవారం ఎన్నికల కమిషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రధానమంత్రిపై చేసిన ఆరోపణలపై గురువారం రాత్రి 8 గంటలలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రియాంక గాంధీ మోడీపై తప్పుడు ఆరోపణలు చేశారని బిజెపి నాయకులు ఫిర్యాదు చేశారు. అలాగే సోషల్ మీడియాను వేదికగా చేసుకుని మోడీకి వ్యతిరేకంగా ఆమోదయోగ్యం కానీ, అనైతిక వీడియో క్లిప్‌లతో ఆప్ ప్రచారం చేస్తుందని బిజెపి నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. 'సోషల్ మీడియాలో చేసిన ఆరోపణలు, వ్యాఖ్యలుపై వివరణ ఇవ్వాల్సిందిగా కోరుతున్నాము. అలాగే, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంగించినందుకు ఎందుకు తగిన చర్యలు తీసుకోకూడదో సమాధానం ఇవ్వవల్సిందిగా కోరుతున్నాం' అని ఆప్‌కు జారీ చేసిన షోకాజ్ నోటీసుల్లో ఇసి పేర్కొంది.

150 స్థానాలు గెలుస్తాం : మధ్యప్రదేశ్‌పై రాహుల్ విశ్వాసం

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 150 స్థానాల వరకూ విజయం సాధిస్తామని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్ల క్రితం ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిజెపి కూల్చివేసిందని ఆరోపించారు. రాష్ట్ర రాజధాని భోపాల్‌కు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న విదిషాలో మంగళవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడారు. 'కాంగ్రెస్‌కు అనుకూలంగా తుపాను రాబోతోంది. 145 నుంచి 150 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోనుంది. ఐదేళ్ల క్రితం మీరు (మధ్యప్రదేశ్ ప్రజలు) కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. బిజెపి నాయకులు మోడీ, అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్‌లు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి మీ ప్రభుత్వాన్ని కూల్చివేశారు' అని రాహుల్ తెలిపారు. సుమారు 15 నెలల పాటు అధికారంలో ఉన్న కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 27 లక్షల మంది రైతులకు వ్యవసాయ రుణాలను మాఫీ చేసిందని రాహుల్ గుర్తు చేశారు. కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని పడగొట్టడం ద్వారా కార్మికులు, రైతులు, చిరు వ్యాపారులు, నిరుద్యోగులను బిజెపి మోసం చేసిందని రాహుల్ విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17న ఎన్నికలు జరగనున్నాయి.

గిరిజనుల సంక్షేమానికి పాటుపడుతున్నాం : మోడీ

భోపాల్ : గిరిజనుల సంక్షేమానికి బిజెపి పాటుపడుతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని జబువ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో గిరిజన జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తామని, కేజీ నుంచి పీజీ వరకూ బాలికలకు ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారు.

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి ఘోర పరాజయం తప్పదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ రాష్ట్రంలో కొలువుతీరినా తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేయడం, ప్రాజెక్టులు ముందుకు సాగకుండా అడ్డుకోవడమే పనిగా పెట్టుకుంటాయని ఆరోపించారు. తనకు మూడోసారి అవకాశమిస్తే భారత్‌ను ప్రపంచంలో మూడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగేలా చేస్తామని అన్నారు.

రాహుల్ అక్కడికెందుకు వెళ్లరు?

జైపూర్ : రాజస్థాన్‌లో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఉనికి కనిపించడం లేదు. నవంబర్ 25న ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా ఈసారి కాంగ్రెస్, బిజెపిల మధ్య హోరాహోరీ పోటీ కనిపిస్తోంది. రాజస్థాన్ ప్రచారంలో రాహుల్ గాంధీ లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. చివరిసారిగా సెప్టెంబర్ 23న జైపూర్ వచ్చారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అక్టోబర్‌లో రాజస్థాన్‌లో మూడు ఎన్నికల ర్యాలీలు నిర్వహించారు. త్వరలో రాహుల్‌గాంధీ రాజస్థాన్ ఎన్నికల ప్రచారంపై ఫోకస్ పెంచుతారని, రాజస్థాన్‌లో రాహుల్, ప్రియాంక కోసం అనేక ఎన్నికల ర్యాలీలు నిర్వహిస్తారని షెడ్యూల్ చేశారు

హైకమాండ్‌తో గెహ్లాట్‌కు ...

గత ఏడాది సెప్టెంబర్ 25న కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సిఎల్‌పి) సమావేశం ఏర్పాట చేయాలన్న సూచనలను ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌తో పాటు తన మద్దతు ఎమ్మెల్యేలు తిరస్కరించినప్పటి నుంచి కాంగ్రెస్ హైకమాండ్ ఆయనపై అసంతృప్తిగా ఉంది. సచిన్ పైలట్ లేదా అతని మద్దతుదారులను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేస్తే, తాను రాజీనామా చేస్తానని గెహ్లాట్ చెప్పారు. ఈ ఉదంతం తరువాత గెహ్లాట్ , గాంధీ కుటుంబం మధ్య సంబంధాలు క్షీణించడం ప్రారంభించాయి.

రూ.22 వేల కోట్లు ఖర్చు చేసినా...

- మధ్యప్రదేశ్ గ్రామీణ మంత్రి నియోజకవర్గంలో విద్యుత్, రోడ్లు ఏవి?

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లా బమోరి నియోజకవర్గంలో రూ.22 వేల కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి ప్రకటించినా, అభివృద్ధి కానరావడం లేదు. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి , బమోరి ఎమ్మెల్యే మహేంద్ర సింగ్ సిసోడియా నాలుగు నెలల క్రితం తన నియోజకవర్గంలో విద్యుత్, రోడ్లు, పాఠశాలలతో సహా అభివృద్ధి పనులకు రూ.22,000 కోట్లు వెచ్చించామని పేర్కొన్నారు. జ్యోతిరాదిత్య సింధియా సహాయకుడైన సిసోడియా 2020లో బిజెపిలో చేరారు.

2020లో జరిగిన ఉపఎన్నికతో సహా బమోరి నుంచి మూడు ఎన్నికల్లో గెలిచారు. ఈ ప్రాంతంలో "సంజు భయ్యా" అని పిలవబడే ఎమ్మెల్యే, అసెంబ్లీ సెగ్మెంట్‌లో నిర్ణయాత్మక ఓటు ఉన్న గిరిజనుల మధ్య ఆగ్రహంతో ఈసారి తీవ్ర పోరాటాన్ని ఎదుర్కొంటున్నారు.

నీ లెక్క తేలుస్తాం

- బ్రిజ్‌భూషణ్ ప్రకటనపై రెజ్లర్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తప్పకుండా నీ లెక్క తేలుస్తామని బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు రెజ్లర్లు బదులిచ్చారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న బిజెపి ఎంపి, రెజ్లింగ్ సంఘం మాజీ అధ్యక్షులు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ మంగళవారం ట్విట్టర్ (ఎక్స్) వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై చేసిన ఆరోపణలకు ఎవరి దగ్గర ఆధారాలు లేవని, ఆరోపణలు చేసిన ఆటగాళ్లు ఉదయం ఒకలా, సాయంత్రం మరోలా మాట్లాడుతున్నారని అన్నారు. మహిళా రెజ్లర్లకు తగిన న్యాయం జరిగిందని పేర్కొన్న ఆయన, జంతర్ మంతర్ వద్ద వాళ్ల నిరసనలు తెలిపినప్పుడు వారికి మద్దతుగా రాజస్థాన్ సిఎం అశోక్ గెహ్లాట్‌తోపాటు సచిన్ పైలట్, ప్రియాంక గాంధీ వచ్చారన్నారు. మహిళా రెజ్లర్లకైతే న్యాయం జరిగింది కానీ, వారికి మద్దతుగా జంతర్ మంతర్ వద్దకు వచ్చిన రాజస్థాన్ సిఎం మాత్రం తన రాష్ట్రంలోని మహిళలకు న్యాయం చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ మహిళా విభాగానికి నాయకత్వం వహిస్తున్న ప్రియాంక గాంధీ మౌనం పాటించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రాజస్థాన్‌లో ప్రతిరోజూ పదుల సంఖ్యలో అత్యాచార ఘటనలు జరుగుతున్నాయని, రాజస్థాన్‌లో మహిళలు న్యాయం కోసం అడుగడుగునా పోరాడుతున్నారని బ్రిజ్‌భూషణ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ ఘటనలకు పక్కా ఆధారాలు ఉన్నాయి కాబట్టే.. ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రియాంక గాంధీని అడుగుతున్నానని చెప్పారు. ఈ ఘటనలపై సోనియా గాంధీ ఎందుకు స్పందించడం లేదని, ఆమె నోటికి ఎవరు తాళం వేశారని అన్నారు. రాష్ట్రంలోని ఆడవాళ్లకు గెహ్లాట్, పైలట్ ఎప్పుడు న్యాయం చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. దీంతో నెటిజన్లు సైతం బ్రిజ్‌భూషణ్‌పై తిట్లపురాణం సంధిస్తున్నారు. ఒక రేపిస్టు.. వేధింపులకు వ్యతిరేకంగా గళమెత్తడం ఆశ్చర్యంగా ఉందని చురకలంటిస్తున్నారు. దీంతో.. బజరంగ్ పునియా, వినేశ్ ఫోగట్ ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నీ లెక్కలు తప్పకుండా తేలుస్తామని హెచ్చరించారు. బ్రిజ్‌భూషణ్ ట్వీట్‌ను రెజ్లర్ బజరంగ్ పునియా రీట్వీట్ చేస్తూ.. 'మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి, ఇతరులకు అద్దం చూపిస్తున్నాడు. బ్రిజ్ భూషణ్ అధికార పార్టీకి చెందిన ఎంపి కాకపోయి ఉంటే, ఆయన కథ మొత్తం బట్టబయలై ఉండేది. అధికార రక్షణలో రెజ్లింగ్‌ను కబ్జా చేసి, నువ్వు చేసిన దారుణ పనులు.. భారత క్రీడా చరిత్రలో నల్ల అక్షరాలతో లిఖించబడతాయి' అని ఆగ్రహించారు. బ్రిజ్‌భూషణ్‌పై 'నీ లెక్క తేల్చే తీరుతాం' అని వినేశ్ ఫోగట్ ధ్వజమెత్తారు.

అత్యంత అమానుషం!

- ఇజ్రాయిల్ దాష్టీకంతో అల్-షిఫా ఆస్పత్రి ఆవరణలోనే 179 మంది ఖననం!
- ఆస్పత్రి పరిసరాల్లో శవాల దుర్వాసన

గాజా : ఇజ్రాయెల్ నిరంతరం దాడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న గాజా నగరంలో అతిపెద్ద ఆసుపత్రి అల్ షిఫాలో అమానుషమైన పరిస్థితులు నెలకొన్నాయి. గత 72 గంటలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఏడుగురు నవజాత శిశువులతో సహా 32 మంది రోగులు మరణించారు. దాడులు, ఆస్పత్రి చుట్టూ ఇజ్రాయిల్ బలగాల మోహరింపు కారణంగా బయటకు వెళ్లే పరిస్థితి లేక చిన్నారులతో సహా 179 మృతదేహాలను ఆసుపత్రి ఆవరణలోనే సామూహిక ఖననం చేసినట్లు ఆస్పత్రి చీఫ్ మొహమ్మద్ అబు సాల్మియా మంగళవారం తెలిపారు. ఆస్పత్రికి నీరు, కరెంటు, ఔషధాల సరఫరా నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్పిటల్ సామూహిక సమాధిగా మారిందని మంగళవారం ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమందికి ప్రాణాలు పోయాల్సిన ఆసుపత్రి ఇజ్రాయెల్ సైన్యం దిగ్బంధించడం వల్ల నేడు సమాధిగా మారిందని అన్నారు. మరికొన్ని మృతదేహాలు ఆసుపత్రి కాంప్లెక్స్‌లో పడి ఉన్నాయని చెప్పారు.

డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ మాట్లాడుతూ ఆసుపత్రి పూర్తి సామర్థ్యంతో పనిచేయడం లేదని అన్నారు. ఆసుపత్రి నిర్వహణ కోసం ఇజ్రాయెల్ సైన్యం 300 లీటర్ల ఇంధనాన్ని అందించిందని ఆయన తెలియజేశారు. అయితే ఇది గంటకు కూడా సరిపోవడం లేదు. రోజుకు 8000 లీటర్ల ఇంధనం అవసరం. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం, విద్యుత్, ఔషధాల కొరత కారణంగా అల్-షిఫా ఆసుపత్రిలో ఇప్పటివరకు 12 మంది రోగులు మరణించారు. ఇందులో ఇద్దరు నెలలు నిండని శిశువులు ఉన్నారు.

అల్-రాంటిసి, టర్కీ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న 3000 మంది క్యాన్సర్ రోగుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గాజాలోని 35 ఆసుపత్రుల్లో 23 పూర్తిగా మూతపడ్డాయి. ఐక్యరాజ్యసమితి పాఠశాలపై కూడా దాడి జరిగింది. గాజాలో ఇప్పటివరకు 12వేల మందికి పైగా మరణించినట్లు సమాచారం. అయితే కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడంతో కచ్చితమైన సమాచారం లభించడం లేదు. ఎక్కడికక్కడ మృతదేహాలు పడి వుండడంతో అవి కుళ్లిపోయి తీవ్రమైన దుర్వాసన వస్తోందని మీడియా వార్తలు పేర్కొన్నాయి. ఈ ఆసుపత్రిలో ఆది, సోమవారాల్లో వరుసగా 39 మంది, 36 మంది శిశువులు మృతి చెందినట్లు పిల్లల విభాగం డాక్టర్ మొహమ్మద్ తబాషా సోమవారం మీడియాకు తెలిపారు. గాజాలోని 35 ఆసుపత్రుల్లో 23 పూర్తిగా మూతపడ్డాయి. మిగిలిన ఆస్పత్రుల్లో కూడా ఆరోగ్య కార్యకర్తలు, రోగులను ఇజ్రాయెల్ సైన్యం బయటికి అనుమతించడం లేదని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. గాజా నగరానికి పశ్చిమాన ఉన్న అల్-రిమాల్, తాల్ అల్-హవా, అల్-తుఫా, షేక్ అజ్లిన్ పరిసరాలు, బీచ్ శరణార్థి శిబిరంపై బాంబు దాడులు జరగగా, శరణార్థుల శిబిరంపై దాడిలో ఏడుగురు చనిపోయారు. ఐక్యరాజ్యసమితి పాఠశాలపై కూడా దాడి జరిగింది. గాజాలో ఇప్పటివరకు 11,360 మందికి పైగా మరణించినట్లు సమాచారం. అయితే కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడంతో కచ్చితమైన సమాచారం లభించడం లేదు. ఈ పరిస్థితుల పట్ల ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

మరోవైపు గాజాలోని ప్రధాన ఆస్పత్రి అల్-షిఫాను హమాస్ కమాండ్ సెంటర్‌గా ఉపయోగిస్తున్నారన్న ఇజ్రాయిల్ ఆరోపణలను హమాస్ తీవ్రంగా ఖండించింది. ఇందుకు ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని హమాస్ సీనియర్ అధికారి పేర్కొన్నారు.

ఆస్పత్రి క్రింద సొరంగం!

గాజా నగరంలోని చిల్డ్రన్స్ రాంటిసి ఆసుపత్రిలో హమాస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని సోమవారం రాత్రి ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. దాడికి పాల్పడిన ఆసుపత్రి కింద సొరంగంలో హమాస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను కనుగొన్నట్లు ఐడిఎఫ్ ప్రతినిధి రియర్ అడ్మ డేనియల్ హగారి మీడియాతో తెలిపారు. ఆసుపత్రి నుండి సైనికులపై కాల్పులు జరిపిన వారిని హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం ఓ వీడియో ద్వారా పేర్కొంది.

గాజాపై హమాస్ పట్టు కోల్పోతోంది : ఇజ్రాయెల్

గాజాపై హమాస్ పట్టు కోల్పోతోందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్ మీడియాతో చెప్పారు.



ఇజ్రాయిల్ దళాలు అడ్డుకుంటుండటంతో అల్-షిఫా ఆసుపత్రిలోనే మృతదేహాలకు సామూహిక ఖననం చేస్తున్న ఆసుపత్రి వర్గాలు

మూడు రోజులుగా టన్నెల్లోనే కార్మికులు

- ట్రెంచ్‌లెస్ సాంకేతికతతో తీసుకొచ్చే యత్నం



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో నిర్మాణంలో ఉన్న టన్నెల్ కూలిపోయి అందులో చిక్కుకుపోయిన 40 మంది కార్మికులను రెండు రోజులు గడిచినా అధికారులు బయటకు తీసుకుని రాలేకపోయారు. మంగళవారం వీరిని బయటకు తీసుకుని రావడానికి భారీ ఎక్స్‌వేటర్లతో ప్రయత్నించారు. అయితే కూలిన టన్నెల్ శిథిలాలు అవరోధంగా మారాయి. మంగళవారం సాయంత్రం నుంచి 'ట్రెంచ్‌లెస్' సాంకేతికత ద్వారా కార్మికులను బయటకు తీసుకుని రావడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ సాంకేతికత ద్వారా తేలికపాటి ఉక్కు పైపులతో మార్గాన్ని ఏర్పాటు చేసి కార్మికులను బయటకు తీసుకుని వస్తామని అధికారులు చెబుతున్నారు. చిక్కుకుపోయిన వారికి ఆహారాన్ని, ఆక్సిజన్‌ను సరఫరా చేస్తున్నారు. కార్మికులు సురక్షితంగానే ఉన్నారని అధికారులు చెబుతున్నారు. చిక్కుకునిపోయి మూడు రోజులు అవుతుండటంతో కార్మికుల బంధువులు ఆందోళనగా ఉన్నారు.

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలోని సిల్క్యారా- దండల్‌గావ్‌ను కలిపే లక్ష్యంగా ఉత్తరకాశీ-యమనోత్రి జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సొరంగం ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. 40 మంది కార్మికులు ఇందులో చిక్కుకుపోయారు. వీరంతా బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లకు చెందిన వారు.


ఢిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం

న్యూఢిల్లీ : దీపావళి తరువాత ఢిల్లీ, దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో వాయు నాణ్యత మరింత క్షీణించింది. దీంతో అక్కడి పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. దీపావళికి మూడు రోజుల ముందు రెండు రోజుల పాటు కురిసిన ఆకస్మిక వర్షాల వల్ల అక్కడ వాయు నాణ్యత కొంత మెరుగుపడింది. కార్లకు అమలు చేద్దామనుకున్న సరి-బేసి విధానాన్ని వాయిదా వేశారు. దీపావళి నేపథ్యంలో ఈ ప్రాంతంలో గాలి నాణ్యత పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. మంగళవారం ఉదయం ఢిల్లీలోని అనేక ప్రాంతాల్ని పొగ కమ్మేసింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 363గా రికార్డయింది. దీంతో ఢిల్లీలో వాయుకాలుష్యం తారాస్థాయికి చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఢిల్లీలో వెదర్ డేటా తెలుసుకునేందుకు కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం 40 మానిటరింగ్ స్టేషన్లలో కేవలం తొమ్మిది స్టేషన్ల ద్వారా మాత్రమే వెదర్ డేటాను రిలీజ్ చేసినట్లు తెలుస్తోంది. దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం పేల్చిన టపాసుల వల్ల మరోసారి ఢిల్లీలో వాయు కాలుష్యం మరింత పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు.

మహదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్ డాబర్ గ్రూప్ చైర్మన్, డైరెక్టర్‌తో సహా 32 మందిపై కేసు

ముంబయి : రూ.15 వేల కోట్ల మహదేవ్ బుక్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ గ్యాంబ్లింగ్, సైబర్ మోసం కుంభకోణంలో ముంబయి పోలీసులు 32 మందిపై మంగళవారం కేసు నమోదు చేశారు. వీరిలో డాబర్ గ్రూప్ డైరెక్టర్ గౌరవ్ బర్మన్, చైర్మన్ మోహిత్ బర్మన్, నటులు సాహిల్ ఖాన్ తదితరులు ఉన్నారు. మోహిత్ బర్మన్ 16వ నిందితుడిగానూ, గౌరవ్ బర్మన్ 18వ నిందితుడిగానూ ఉన్నారు. సాహిల్ ఖాన్ 26వ నిందితుడిగా ఉన్నారు. ముంబయికి చెందిన సామాజిక కార్యకర్త ప్రకాష్ బంకర్ ఫిర్యాదు మేరకు మాతుంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మహదేవ్ బెట్టింగ్ యాప్ ద్వారా ప్రజలను మోసం చేశారని బంకర్ తన ఫిర్యాదులో ఆరోపించారు. దర్యాప్తు ప్రారంభించామని, యాప్ ప్రమోటర్లు సౌరభ్ చంద్రకర్, రవి ఉప్పల్, శుభమ్ సోనీలను ప్రధాన నిందితులుగా పేర్కొన్నామని పోలీసులు చెప్పారు. ఈ యాప్ ప్రమోటర్లు ఛత్తీసగఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌కు సుమారు రూ.508 కోట్లు చెల్లించారనే ఆరోపణలపై ఇడి కూడా దర్యాప్తు ప్రారంభించింది.

తోషఖానా, అల్-ఖదిర్ ట్రస్టు కేసుల్లో ఇమ్రాన్‌పై విచారణ



ఇస్లామాబాద్ : సిఫర్ కేసులో అరెస్టయి ఇప్పటికే అదియాలా జైల్లో వున్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను తోషఖానా బహుమతుల కేసులో, అల్-ఖదిర్ ట్రస్టు కేసులో కూడా అవినీతి నిరోధకబ్యూరో అధికారులు అరెస్టు చేసినట్లు మీడియా వార్తలు మంగళవారం తెలిపాయి.

అరెస్టు వారంట్లను అకౌంటబిలిటీ కోర్టు జడ్జి మహ్మద్ బషీర్ ధ్రువీకరించి, వెంటనే అమలు చేయాల్సిందిగా అదియాలా జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించడంతో సోమవారం ఎన్ఎబి (నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో) అధికారులు అరెస్టు చేశారని డాన్ వార్తా పత్రిక పేర్కొంది. ఇమ్రాన్‌ను రిమాండ్‌కు అప్పగించినట్లు కోర్టు నుండి సమాచారం అందగానే ఎన్ఎబి బృందం జైల్లోనే ఆయనను విచారిస్తుంది. అరెస్టు వారంట్లను అమలు చేయడమంటే ఆ రెండు కేసుల్లో కూడా ఆయనను అరెస్టు చేసినట్లే. ఎన్ఎబి నమోదు చేసిన కేసులో తాజా అరెస్టు వారంటు జారీ అయింది. ఈ రెండు కేసుల్లోనూ తాము ఇమ్రాన్‌పై విచారణను పూర్తి చేయాల్సి వున్నందున వెంటనే ఆయనపై అరెస్టు వారంట్లు జారీ చేయాల్సిందిగా కోరుతూ ఎన్ఎబి కోర్టును ఆశ్రయించింది.

ప్రపంచం దారి తప్పుతోంది !

- వాతావరణ ఒప్పందాల అమలుపై ఐరాస హెచ్చరిక

పారిస్ : గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెల్సియస్‌కి పరిమితం చేసి, వినాశకరమైన వాతావరణ ప్రభావాలను నివారించాలన్న ఒప్పందాలు, నిబద్ధతల నుంచి ప్రపంచం పక్కకు మళ్ళుతోందని ఐక్యరాజ్య సమితి మంగళవారం హెచ్చరించింది. తాజాగా కాలుష్య ఉద్గారాలను తగ్గిస్తామంటూ చేసిన ప్రతినల ప్రభావాన్ని తాజా అంచనాలు, సమీక్షలను బట్టి చూసినట్లైతే దశాబ్ద కాలంలో కేవలం స్వల్ప స్థాయిలోనే తగ్గినట్లు తెలుస్తోందని పేర్కొంది. అందరూ ఎంతగానో ఆశలు పెట్టుకున్న వాతావరణ చర్చలు మరికొద్ది వారాల్లో జరగబోతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పుల సంస్థ ఈ నివేదిక విడుదల చేసింది. కాలుష్య కారక వాయువులను తగ్గించడానికి అత్యవసర ప్రాతిపదికన చర్యలు చేపట్టడంలో ప్రపంచ దేశాలు విఫలమయ్యాయని పేర్కొంది. దాదాపు 200 దేశాలు ఇచ్చిన హామీలు, చేసిన ప్రతినలు చూసినట్లైతే 2030 కర్బన ఉద్గారాలు 2019 స్థాయి కన్నా కేవలం 2శాతమే తగ్గనున్నాయి. గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలన్న పారిస్ ఒప్పందం లక్ష్యానికి ఇది చాలా తక్కువని ఐక్యరాజ్య సమితికి చెందిన ఐపిసిసి వాతావరణ ప్యానెల్ పేర్కొంది. 'ఒక డిగ్రీలో అతి స్వల్ప భాగం కూడా ఇక్కడ ఆలోచించాల్సిన అంశమే, కానీ మనందరమూ చాలా తీవ్రంగా దారి తప్పుతున్నాం. దాన్ని మార్చేందుకు కాప్ 28 మనకు గల అవకాశం' అని ఐక్యరాజ్య సమితి క్లైమేట్ ఛేంజ్ చీఫ్ సైమన్ స్టీల్ వ్యాఖ్యానించారు. పెరుగుతున్న వరదలు, వేడిగాలులు, తుపానులతో ప్రపంచం ఇప్పటికే ధ్వంసమవుతోందని, అందువల్ల ఈ నెలాఖరులో దుబాయ్‌లో జరిగే వాతావరణ చర్చల్లో స్పష్టమైన కీలక మలుపును సాధించాలని ఆయన కోరారు.

ప్రచ్ఛన్న యుద్ధం అవశేషమే జి-7

- ఉత్తర కొరియా విమర్శ

సియోల్ : ప్రచ్ఛన్న యుద్ధం అవశేషంగా జి-7 దేశాలను ఉత్తర కొరియా విమర్శించింది. ఆ దేశాలు తమ సొంత ప్రయోజనాల కోసం ఘర్షణలు సృష్టిస్తాయని, ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘిస్తాయని ఉత్తరకొరియా ప్రభుత్వ మీడియా కెసిఎన్ఎ మంగళవారం తెలిపింది. గత వారం టోక్యోలో సమావేశానంతరం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఉత్తర కొరియా ఆత్మరక్షణ చర్యలను, చట్టబద్ధమైన సార్వభౌమాధికారాన్ని జి-7 దేశాల విదేశాంగ మంత్రులు విమర్శించడాన్ని ప్యాంగాంగ్ విదేశాంగ శాఖ ఉన్నతాధికారి ఒకరు తీవ్రంగా తప్పుబట్టారు. ఇటీవల అంతర్జాతీయ సంక్షోభం పెచ్చరిల్లడానికి జి-7 దేశాలే కారణమని విదేశాంగ శాఖ అంతర్జాతీయ విభాగ డైరెక్టర్ జనరల్ జో చోల్ సూ విమర్శించారు.

అంతర్జాతీయ శాంతిని, భద్రతను ధ్వంసంచేసే అత్యంత ప్రధానమైన, ప్రమాదకరమైన మూలం జి-7 అని ఆయన వ్యాఖ్యానించారు. న్యాయమైన అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడకుండా అడ్డుకునేది కూడా ఆ దేశాలేనన్నారు. జి-7 అనేది అంతర్జాతీయ సమాజాన్ని ప్రతిబింబించదని, కేవలం కొన్ని దేశాల ప్రయోజనాలను మాత్రమే పరిరక్షిస్తుందని అన్నారు. ఉక్రెయిన్‌కు ప్రధానంగా ఆయుధ సరఫరాదారు అమెరికానే అని విమర్శించారు.

ఎర్రచందనం వ్యాపారం ఇక చట్టబద్ధం

- ఆంక్షలు తొలగించిన కేంద్రం
- వివాదాస్పద నిర్ణయమంటున్న పర్యావరణ వేత్తలు

న్యూఢిల్లీ : ఎర్ర చందనం ఎగుమతులపై అమలులో ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. దీంతో ఎర్ర చందనం ఎగుమతులకు సంబంధించి కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్‌డేంజర్డ్ స్పెసిస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా (సీఐటీఈఎస్) 'ప్రతికూల' జాబితా నుంచి భారత్‌ను తొలగించారు. దీనివల్ల ఎర్ర చందనం వ్యాపారంలో రైతులు చట్టబద్ధంగానే ప్రవేశించవచ్చునని, మంచి ఆదాయం పొందవచ్చునని ప్రభుత్వం చెబుతోంది. సీఐటీఈఎస్ నిబంధనలను పాటించడం, దేశీయ చట్టాల్లో సవరణలు చేయడంతో ఈ వెసులుబాటు లభించిందని తెలిపింది. ఎర్ర చందనాన్ని ఫర్నీచర్, హస్తకళలకు సంబంధించిన వస్తువుల తయారీకి ఉపయోగిస్తారు. జౌళి, మందుల తయారీ పరిశ్రమల్లో కూడా దీనిని వాడతారు.

గతంలో ఎర్ర చందనం అక్రమ రవాణాపై పలు ఉదంతాలు వెలుగు చూడడంతో సీఐటీఈఎస్ భారత్‌ను 'ప్రతికూల' దేశాల జాబితాలో చేర్చింది. గణనీయ వాణిజ్య సమీక్ష (ఆర్ఎస్‌టీ) నుంచి తొలగించింది. 2004 నుంచి ఇది కొనసాగుతోంది. నిబంధనలు పాటించని దేశాలపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఈ జాబితా ద్వారా సీఐటీఈఎస్‌కు దఖలు పడింది. గతంలో మన దేశం కూడా వ్యాపార సస్పెన్షన్‌కు గురైంది. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో ఎర్ర చందనం చెట్లను పెంచుతున్నారు. ఇప్పుడు లభించిన వెసులుబాటుతో దాని పెంపకందారులు చట్టబద్ధంగానే వ్యాపారం చేసుకోవచ్చు.

ఎర్ర చందనాన్ని ఇప్పటి వరకూ చాలా మంది అక్రమంగానే సాగు చేస్తున్నారు. చెట్లు పెరిగిన తర్వాత వాటిని కొట్టేసి దొంగచాటుగా రవాణా చేస్తూ పెద్ద మొత్తంలో సొమ్ము ఆర్జిస్తున్నారు. దీనివల్ల సహజ అడవులు అంతరించిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం తీసుకున్న నిర్ణయంపై పర్యావరణ వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హిందూ మహా సముద్రంలో భూకంపం

- శ్రీలంకలో ప్రకంపనలు

కొలంబో : హిందూ మహా సముద్రంలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత 6.2గా నమోదైంది. వీటి ప్రభావంతో కొలంబోలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని జాతీయ భూకంపాల కేంద్రం (ఎన్‌సిఎస్) ఎక్స్‌లో పోస్టు పెట్టింది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భూమి తీవ్రంగా కంపించిందని, సముద్రంలో శ్రీలంకకు ఆగ్నేయంగా 800కిలోమీటర్ల దూరంలో, 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం వుందని ఎన్‌సిఎస్ తెలిపింది.

శ్రీలంకకు ఎలాంటి ప్రమాదం లేదని అధికారులను ఉటంకిస్తూ స్థానిక మీడియా పేర్కొంది. ఉత్తర సుమత్రా దీవులకు 1295 కిలోమీటర్ల దూరంలో భూకంపం సంభవించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) తెలిపింది.





మీ కోసం

ఫ్లవర్‌వాజ్‌లో ఉప్పు కలిపిన నీటిని పోస్తే, పూలు ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి.

జీవన సౌరభం

ఫలితాన్ని ఆశించి పరుగెత్తవద్దు. పనిచేస్తూ పోతే ఫలితం అదే వస్తుంది.

సమయస్ఫూర్తి




కుందేలు, తాబేలు, ఉడుత మంచి స్నేహితులు. కుందేలుకి కంగారెక్కువ. ఆలస్యం అమృతం విషం అంటుంది. తాబేలు ఏమో నిదానమే ప్రధానం అంటుంది. ఉడుత మాత్రం సమయానుకూలంగా, ముందు చూపుతో సమయస్ఫూర్తిగా నడుచుకోవాలి అంటుంది.

ఉడుతతో ఏకీభవించకుండా కుందేలు, తాబేలు తమ వాదనలే సరైనవని విభేదించేవి. ఒకరోజు నిదానమే ప్రధానం అనుకుంటూ వెళుతున్న తాబేలుపై తోడేలు దాడి చేయబోయింది. అది గమనించిన ఉడుత చెట్టు చాటునుంచి సింహాన్ని అనుకరిస్తూ గర్జించింది. తోడేలు తనకి సింహం నుండి ముప్పు వాటిల్లుతుందని తాబేలును వదిలేసి పలాయనం చిత్తగించింది. అంతలో అటు కంగారుగా వస్తున్న కుందేలు ఆలస్యం అమృత విషం అనుకుంటూ దారిలో గమనించకుండా ఊబిలో చిక్కుకుంది. ఊడలు పట్టుకుని ఊగుతున్న ఉడుత కుందేలును చూసి ఒక ఊడను ఊబిలోకి అందించింది. ఊడను పట్టుకుని కుందేలు బతుకు జీవుడా అంటూ ఊబిలోంచి బయట పడింది.

ముందు చూపుతో సమయస్ఫూర్తిగా నడుచుకోకపోతే ప్రమాదం వాటిల్లుతుందని ఉడుత వాదనే సరైనదని తెలుసుకున్న కుందేలు, తాబేలు ఆ రోజు నుండి తాము కూడా సమయస్ఫూర్తిగా నడుచుకోవడం నేర్చుకున్నాయి.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

జత చేయండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్లను, వాటి నీడలను ఇచ్చాం. గజిబిజిగా ఉన్న ఆ నీడల్లో ఏ పండుకు ఏ నీడో జత చేయండి.

నేను గీసిన బొమ్మ





సి.నరసింహా, 5వ తరగతి, దిగువ సాంబయ్య పాళెం, తొట్టంబేడు(మం), తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇటుకలు ఎత్తిన చేతితోనే అక్షరాలు దిద్దిస్తున్నాడు..

మండే ఎండ, చుట్టూ దుమ్ముతో నిండిన గాలి, కాళ్లకు చెప్పులు లేవు, అయినా ఆ పిల్లవాడు తన శక్తికి మించి ఆ ఇటుకబట్టీలో పనిచేస్తున్నాడు. అతనికి చదువంటే వల్లమాలిన అభిమానం. కానీ కుటుంబ పరిస్థితులు అతన్ని చదువుకు దూరం చేసి బాల కార్మికునిగా మార్చాయి. పట్టుమని 16 ఏళ్లు కూడా లేని అతడు, అప్పడే నిర్ణయించుకున్నాడు. తనలా చదువుపై ప్రేమ ఉన్న మరెవ్వరూ విద్యకు దూరం కాకూడదని. ఇదంతా 27 ఏళ్ల క్రితం నాటి సంగతి. ఇప్పుడు అతడు పెరిగి పెద్దయి చిన్ననాడు తను కన్న కలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నాడు. తమిళనాడు విల్లుపురానికి చెందిన అతని పేరు దామోదరన్. ఉన్నత విద్యావంతుడిగా మెరుగైన ఉపాధి మార్గం పొందే అవకాశం ఉన్నా గ్రామీణ ప్రాంతాల చిన్నారుల భవిష్యత్తు కోసం పరితపిస్తున్నాడు.

బాలకార్మికునిగా ఇటుకల బట్టీలో పనిచేసిన దామోదరన్ ప్రస్తుతం లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థ 'ఎయిడ్ ఇండియా' ద్వారా 25 లక్షల పైచిలుకు చిన్నారుల జీవితాలను తీర్చిదిద్దారు. 'ఎర్రని ఎండలో నెత్తిన బరువుపెట్టుకుని ఆ ఇటుకల బట్టీలో పనిచేయడం నాకు ఇంకా గుర్తే. మా గ్రామాల్లో చాలామంది పిల్లలు తెల్లవారేసరికి ఇటుకల బట్టీలకు వెళ్లే ట్రాక్టరులో ఉండేవారు. రోజంతా పనిచేసి సాయంత్రానికి బయటపడ్డామని ఊపిరి పీల్చుకునేవారు. కానీ మరుసటి రోజు నిద్రలేచే సరికి మళ్లీ అదే ట్రక్కులో పనికి వెళ్లాల్సి వచ్చేది. నేను కొన్ని రోజులు స్కూలుకు వెళ్లిన తరువాత బట్టీలో పనికి కుదిరాను. కానీ చాలామంది పిల్లలు అసలు స్కూలు ముఖం కూడా చూడకుండా ఇటుకలబట్టీల వైపు నడిచారు' అంటూ తనకెదురైన చేదు అనుభవాలను దామోదర్ గుర్తుచేసుకున్నారు.



రెండేళ్లపాటు ఇటుకల బట్టీలో పనిచేసిన దామోదరన్ ఆ తరువాత తన జీవితంలో పెద్ద మార్పు వైపు అడుగులు వేశారు. గ్రామాన్ని విడిచిపెట్టి చెన్నయ్ నగరానికి వచ్చేశాడు. అక్కడే కాలేజీ విద్యనభ్యసించారు. సైన్స్ విద్యార్థిగా మెరుగైన ప్రతిభతో రాణించారు. తారామణి ప్రాంతంలో నివసిస్తున్న దామోదరన్‌కు అక్కడే ఉన్న 'ఎయిడ్ ఇండియా' సంస్థ గురించి తెలిసి అందులో వాలంటీర్‌గా చేరారు. చుట్టుపక్కల ఉన్న మురికివాడల పిల్లలకు చదువుచెప్పేందుకు ప్రతిరోజూ అక్కడికి వెళ్లేవాడు. సేవామార్గంలో పయనిస్తూనే తన విద్యాభ్యాసం కొనసాగించారు. మద్రాస్ యూనివర్శిటీలో ఆంత్రోపాలజీలో మాస్టర్స్ చేశారు. ఆ తరువాత ఎంఫిల్, పిహెచ్‌డి పూర్తిచేశారు.

ఇరులర్ ఆదివాసీ పిల్లల అభ్యసనా లోపాలపై పిహెచ్‌డి సమర్పించిన దామోదరన్ ఆ పిల్లల బాగు కోసం ఏళ్లతరబడి కృషి చేస్తున్నారు. ఎంతోమంది పిల్లలను ఎయిడ్ ఇండియా చెంతకు చేర్చి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఇప్పుడా పిల్లలు బాలకార్మికులుగా మారకుండా బడి బాట పట్టారు. 'ఉన్నత విద్య అభ్యసించినా, మెరుగైన ఉపాధి అవకాశాలున్నా ఎప్పుడూ ఆ దిశగా ఆలోచించలేదు. ఈ పిల్లలకు చదువు నేర్పించడంలోనే ఎక్కువ సంతోషపడతాను.

మారుమూల గ్రామాలకు వెళ్లి చదువుకు దూరమైన, వెనుకబడిన తరగతులు, ఎస్‌సి, ఎస్‌టి పిల్లలను గుర్తించి వాళ్లందరికీ విద్యకు దగ్గర చేస్తున్నాను. అలా ఇప్పటివరకు 25 లక్షలకు పైగా చిన్నారులు స్కూలుకు వెళుతున్నారు. ఇదంతా ఒక్క రోజులో జరగలేదు. ఇంకా ఎంతోమంది బడి ఈడు పిల్లలు, బాలకార్మికులుగా జీవిస్తున్నారు. వారంతా చదువు మార్గం పడితేనే నాలాంటి వారు సంతోషపడతారు. ఆ రోజు కోసం ఎదురు చూడకుండా నావంతు బాధ్యతగా ఇదంతా చేస్తున్నాను' అంటున్నారు దామోదర్ ఎంతో సంతోషంగా.

ఫైనలే టార్గెట్..

నేడు న్యూజిలాండ్‌తో భారత్ సెమీస్ పోరు

టాస్ కీలకం ● మ.2.00గం॥ల నుంచి

ముంబయి: ఐసిసి వన్డే ప్రపంచకప్ టోర్నీలో లీగ్ పోటీలు ముగిసాయి. 45 లీగ్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో టాప్-4 లో నిలిచిన జట్ల మధ్య సెమీస్ పోరు జరగనుంది. గ్రూప్‌లో అగ్రస్థానంలో టీమిండియా 4వ స్థానంలో న్యూజిలాండ్‌తో తొలి సెమీస్‌లో తలపడనుంది. వాంఖడే మైదానంలో జరిగే తొలి సెమీస్‌లో టాస్ కీలకంగా మారనుంది. టాస్ గెలిచిన కెప్టెన్ తొలుత బ్యాటింగ్‌కే మొగ్గు చూపనున్నారు. 2019 వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో టీమిండియా విజయ తీరాలకు చేరుతున్న దశలో మహేంద్ర సింగ్ ధోనీ రనౌట్‌ను భారత క్రీడాభిమానులను ఇప్పటికీ కలచివేస్తోంది. ఆ వేదనను మరచిపోవాలంటే నేటి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను తప్పక ఓడించాల్సిందే. లీగ్ దశలో టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై చిత్తుచేసింది. తొలిధర్మశాల వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 273పరుగులకు ఆలౌట్ కాగా.. భారతజట్టు 48ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 274పరుగులు విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో టీమిండియా పేసర్ మహ్మద్ షమీ(5/54) అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. మరోవైపు విరాట్ కోహ్లి(95) సెంచరీకి చేరువౌ ఔటయ్యాడు. రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా దుర్భేధ్య ఫామ్‌లో ఉంది. లీగ్ దశలో ఆడిన 9 మ్యాచుల్లోనూ నెగ్గిన ఏకైక జట్టు భారతజట్టు మాత్రమే. మరే జట్టు ఈసారి టోర్నమెంట్‌లో ఇంత మెరుగైన ప్రదర్శనను కనబర్చలేదు. టాప్ ఆర్డర్, మిడిలార్డర్ బ్యాటర్స్ అందరూ ఫామ్‌లో ఉండడం టీమిండియాకు కలిసొచ్చే అంశం. మరోవైపు పేసర్ల విభాగంలో బుమ్రా, సిరాజ్, షమీతోపాటు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజాకూడా మెరుగైన ప్రదర్శనను కనబరుస్తున్నారు.



ఇక న్యూజిలాండ్ జట్టు విషయానికొస్తే.. ఓపెనర్ రచిన్ రవీంద్ర, మిఛెల్ అద్భుత ఫామ్‌లో ఉన్నారు. కివీస్ జట్టు టోర్నీ ప్రారంభంలో ఆడిన నాలుగు మ్యాచుల్లో గెలిచి నా.. ఆ తర్వాత ఐదు మ్యాచుల్లో నాలుగింటిలో ఓడి ఒక్క మ్యాచ్‌లో మ్యాచ్ విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో పాకిస్తాన్‌ను వెనక్కి నెట్టి 4వ స్థానంలో నిలిచి సెమీఫైనల్లో కి ప్రవేశించింది. న్యూజిలాండ్ జట్టు ఇప్పటివరకు వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడక పోయినా.. ఆ జట్టు స్థిరంగా రాణిస్తోంది. 13 వన్డే ప్రపంచకప్ టోర్నీలో ఆ జట్టు ఏకంగా తొమ్మిదిసార్లు సెమీఫైనల్ కు చేరింది. 2007 నుంచి కివీస్ జట్టు వరుసగా సెమీస్‌కు చేరుతోంది. 2019కప్ మాదిరే భారత్‌పై గెలుస్తామని న్యూజిలాండ్ కెప్టెన్ విలియమ్సన్ ధీమా వ్యక్తం చేస్తున్నాడు. ఇరుజట్ల ఇప్పటివరకు 7సార్లు ముఖాముఖి తలపడగా.. భారతజట్టు 3సార్లు, 4మ్యాచుల్లో ఓటమిపాలైంది. చివరిసారిగా ఇంగ్లండ్ లోని మాంచెస్టర్ వేదికగా జరిగిన 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో భారతజట్టు 18పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఇక 1987లో టీమిండియా వాంఖడే వేదికగా జరిగిన ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్లో 35పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

జట్లు(అంచనా)....

భారత్: రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్(వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, సిరాజ్, బుమ్రా, షమీ, కుల్దీప్.

న్యూజిలాండ్: విలియమ్సన్(కెప్టెన్), కాన్వే, రచిన్ రవీంద్ర, మిఛెల్, ఫిలిప్స్, టామ్ లాథమ్(వికెట్ కీపర్), ఛాప్మన్, సాంట్నర్, టిమ్ సోథీ, ట్రెంట్ బౌల్ట్, లూకీ ఫెర్గ్యుసన్.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి పాముల సాయి వెంకటశివ జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 10న విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయిలో ఎస్‌జిఎఫ్ కరాటే పోటీలలో పాల్గొని బంగారు పతకం సాధించాడు. పాఠశాల నుంచి కరాటే క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సాయివెంకటశివని, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం జాహ్నవిప్రియా పాల్గొన్నారు.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68